తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
17 నవంబర్ 2026
Follow :

వెంచర్ కోసం వాగు బందీ!



- సర్వే నంబర్ 49లో వాగు పరిధి కుదింపుపై ఆరోపణలు
- నీటి ప్రవాహానికి అడ్డుగా వంతెన నిర్మాణం
- గుండం చెరువు ఆయకట్టుకు ముప్పు
- గుట్టలు నేలమట్టం.. హైవే పక్కన చెట్ల తొలగింపు
- అనుమతులపై అనుమానాలు.. అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు

కోహీర్, నవంబర్ 16 (జనంసాక్షి): వెంచర్ ఏర్పాటు పేరుతో సహజ వనరులకు ముప్పు వాటిల్లుతోందనే ఆరోపణలు కోహీర్ మండలంలో కలకలం రేపుతున్నాయి. వెంకటాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 49తో పాటు వేలి గ్రామ శివారులో జాతీయ రహదారి-65ను ఆనుకుని ఏర్పాటు చేస్తున్న వెంచర్ పనులపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వాగు పరిధిని కుదించడం, నీటి సహజ ప్రవాహానికి అడ్డుగా వంతెన నిర్మించడం, సహజ గుట్టలను చదును చేయడం, హైవే పక్కన చెట్లను తొలగించడం వంటి పనులు చేపట్టినట్లు ఆరోపిస్తున్నారు. ఈ పరిణామాలు భవిష్యత్తులో రైతుల సాగునీటిపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వాగు పరిధి కుదించారా?

సర్వే నంబర్ 49 పరిధిలో వెంచర్‌కు ఇరువైపులా ఉన్న భూములను కొనుగోలు చేసిన రియల్టర్లు మధ్యలో ప్రవహించే వాగు ప్రాంతాన్ని పూడ్చి ప్లాట్లలో కలిపేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో వర్షాకాలంలో పెద్ద మొత్తంలో నీటిని మోసుకెళ్లే వాగు ప్రస్తుతం చిన్న కాలువలా మారిందని స్థానికులు చెబుతున్నారు. వాగు అసలు హద్దులు ఎంత? ప్రస్తుతం ఎంత మేర విస్తీర్ణం మిగిలింది? అనే విషయాలను రెవెన్యూ అధికారులు పాత రికార్డులు, సర్వే మ్యాపుల ఆధారంగా పరిశీలించాలని కోరుతున్నారు.

వంతెన నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా?

వెంచర్ మధ్యలో ప్రవహించే వాగుపై వంతెన నిర్మాణం చేపట్టడంపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. భారీ వర్షాల సమయంలో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీటి ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్మాణం చేపట్టారా? సంబంధిత శాఖల అనుమతులు తీసుకున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాగు సహజ ప్రవాహానికి ఆటంకం కలిగితే వరద సమయంలో నీరు వెనక్కి మళ్లి సమీప పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

గుండం చెరువు ఆయకట్టుకు ముప్పు?

చింతలగట్టు గ్రామ పరిధిలోని గుండం చెరువుకు వర్షాకాలంలో ఇదే వాగు ద్వారా నీరు చేరుతుందని స్థానిక రైతులు చెబుతున్నారు. చెరువు నిండితే దాని కింద ఉన్న ఆయకట్టులో పంటలు సాగవుతాయని, పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగడానికి కూడా దోహదపడుతుందని పేర్కొంటున్నారు. వాగు పరిధి కుదించడం, నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడితే చెరువుకు చేరాల్సిన నీరు తగ్గి సాగుపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుట్టలు.. మట్టి తిప్పలు నేలమట్టం

వెంచర్ అభివృద్ధి పనుల్లో భాగంగా సహజంగా ఉన్న రాతి గుట్టలు, మట్టి తిప్పలను జేసీబీలు, ఇతర భారీ యంత్రాలతో తొలగించి భూమిని చదును చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. భూమి సహజ స్వరూపాన్ని మార్చడం వల్ల వర్షపు నీటి ప్రవాహ దిశ మారే అవకాశం ఉందని చెబుతున్నారు. మట్టి తవ్వకాలు, తరలింపులకు అనుమతులు ఉన్నాయా? అనే అంశంపై సంబంధిత శాఖలు విచారణ జరపాలని కోరుతున్నారు.

హైవే పక్కన చెట్ల నరికివేత?

వెంచర్‌లోకి ప్రవేశించేందుకు రహదారి ఏర్పాటు చేసే క్రమంలో జాతీయ రహదారి-65 పరిధిలోని చెట్లను జేసీబీలతో తొలగించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. చెట్ల తొలగింపునకు ఎవరు అనుమతించారు? ఏ శాఖ నుంచి అనుమతులు పొందారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పచ్చదనం పెంపునకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్న సమయంలో ప్రధాన రహదారి పక్కనే చెట్ల తొలగింపుపై అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

వంతెనకు మా కార్యాలయం అనుమతి ఇవ్వలేదు

వెంచర్ మధ్యలో ఉన్న వాగుపై నిర్మించిన వంతెనకు తమ కార్యాలయం నుంచి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ్ కుమార్ తెలిపారు. ఈ వంతెన నిర్మాణానికి సంబంధించిన అనుమతులను సంగారెడ్డిలోని చీఫ్ ఇంజనీర్ కార్యాలయం నుంచి నేరుగా పొందినట్లు పేర్కొన్నారు. దీంతో అసలు అనుమతులు ఏ నిబంధనల ప్రకారం జారీ అయ్యాయి? వాగు నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పరిశీలించారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

అధికారుల తనిఖీలు ఎప్పుడు?

వాగు పరిధి, వంతెన నిర్మాణం, గుట్టల తొలగింపు, చెట్ల నరికివేత ఆరోపణలపై రెవెన్యూ, నీటిపారుదల, అటవీ, జాతీయ రహదారుల శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సర్వే నంబర్ 49లో పాత రికార్డుల ఆధారంగా వాగు హద్దులను గుర్తించి, ప్రస్తుతం చేపట్టిన పనులతో పోల్చి చూడాలని కోరుతున్నారు. వెంచర్‌కు సంబంధించిన అనుమతులు, లేఅవుట్ నిబంధనలు, డ్రైనేజీ వ్యవస్థపై కూడా సమగ్ర విచారణ జరపాలని అంటున్నారు.

సహజ నీటి మార్గాన్ని కాపాడాలి

వెంచర్ అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అయితే అభివృద్ధి పేరుతో సహజ వాగులు, చెరువులకు నీరు చేరే మార్గాలు దెబ్బతినకూడదని రైతులు, గ్రామస్థులు స్పష్టం చేస్తున్నారు. వాగు సహజ ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని, గుండం చెరువుకు నీరు చేరే మార్గాన్ని పరిరక్షించాలని కోరుతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేస్తున్నారు.

అంబేద్కర్ విగ్రహం,
జాతీయ రహదారి వంతెన పనులపై అదనపు కలెక్టర్ సమీక్ష!

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి.. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి!

బాలానగర్, నవంబర్ 16(జనంసాక్షి):
బాలానగర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులతో పాటు జాతీయ రహదారిపై చేపడుతున్న వంతెన నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) మధుసూదన్ నాయక్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనుల్లో జాప్యం లేకుండా వేగవంతం చేసి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా నిర్మాణ పనులు కొనసాగుతున్న సమయంలో ప్రజా రవాణాకు అంతరాయం కలగకుండా, వాహనదారులు, ప్రయాణికులు, స్థానిక





ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి, డిసెంబర్ మొదటి వారం నుంచి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని సంబంధిత కాంట్రాక్టర్ అదనపు కలెక్టర్‌కు హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, నిర్మాణ పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. అంబేద్కర్ విగ్రహ నిర్మాణం, వంతెన పనులు త్వరగా పూర్తయ్యేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఖేలో ఇండియా పోటీలకు తెలంగాణ వేదిక...

- డిసెంబర్ 11 నుంచి 22 వరకు క్రీడా పోటీలు
- లోగో, మస్కట్ ఆవిష్కరణ: మంత్రి దామోదర రాజనర్సింహ



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 16(జనంసాక్షి):
ఖేలో ఇండియా పోటీలకు తెలంగాణ వేదికగా నిలిచిందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

సోమవారం తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా క్రీడా పోటీలకు సంబంధించిన అధికారిక లోగో, మస్కట్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. క్రీడాకారుల్లో స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు జాతీయ స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఖేలో ఇండియా పోటీలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ మాట్లాడుతూ.. ఖేలో ఇండియా పోటీల ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, యువతలో క్రీడలపై అవగాహన, ఆసక్తి పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, జిల్లా యువజన, క్రీడల అధికారి అఖిలేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు మారినా చేయూత పింఛన్లు శాశ్వతం.. సంక్షేమం నిరంతర ప్రక్రియ

- వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా
- రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల కొత్త పింఛన్లు మంజూరు
- అర్హులందరికీ సామాజిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి దామోదర రాజనర్సింహ
- పెండింగ్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందించాలి: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి, నవంబర్ 16 (జనంసాక్షి):
ప్రభుత్వాలు మారినా సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతాయని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం సంగారెడ్డి పట్టణంలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన సంగారెడ్డి నియోజకవర్గ స్థాయి నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.







ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 4.50 లక్షల చేయూత పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 18,591, సంగారెడ్డి నియోజకవర్గంలో 3,917 నూతన పింఛన్లు మంజూరయ్యాయని వెల్లడించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత, చేనేత కార్మికులకు పింఛన్లు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నెల 19న లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో పింఛన్ నగదు జమ అవుతుందని తెలిపారు. విద్య, వైద్యం, సామాజిక భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, సంగారెడ్డి వైద్య కళాశాలకు 18 పీజీ సీట్లు మంజూరయ్యాయని చెప్పారు. జిల్లాలో 90 శాతం వైద్య సేవలను స్థానికంగానే అందుబాటులోకి తీసుకురావడం లక్ష్యమన్నారు. మహిళా సాధికారతకు విద్య ఎంతో అవసరమని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి సుమారు 5 వేల ఇందిరమ్మ ఇళ్లను కేటాయించినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ... పెండింగ్‌లో ఉన్న కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను వెంటనే లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం హామీ ఇచ్చిన తులం బంగారం కూడా అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, టీజీఐఐసీ మాజీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

పెండింగ్
కేసుల పరిష్కారానికి వేగం పెంచాలి

- నర్సాపూర్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన తూప్రాన్ డీఎస్పీ



నర్సాపూర్, నవంబర్ 16 (జనంసాక్షి): నర్సాపూర్ సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, త్వరితగతిన పరిష్కరించాలని తూప్రాన్ డీఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆయన సోమవారం నర్సాపూర్ సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసి, వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన అండర్ ఇన్వెస్టిగేషన్ (యూఐ) కేసులు, పోలీస్ స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.
ఈ సందర్భంగా పెండింగ్ కేసుల దర్యాప్తులో జాప్యం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక చొరవ చూపాలని తెలిపారు. ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అలాగే రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, వాహన దారులు, ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ విధులు సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.

మండల వ్యాప్తంగా హమాలీ ధర
ఒకే విధంగా ఉండాలి: తహసిల్దార్ శ్రీనివాస్ చారి

కొల్చారం, నవంబర్ 16 (జనంసాక్షి):



కొల్చారం మండలంలోని ప్రాథమిక సహకార సంఘాలు మరియు హమాలి యూనియన్లు ఇరువురు సమన్వయంతో మండల వ్యాప్తంగా హమాలి ధర ఒకే విధంగా ఉండేటట్లు నిర్ణయించి రైతులకు సహకరించాలని మండల తహసిల్దార్ శ్రీనివాస్ చారి పిఏసిఎస్ చైర్మన్‌లకు సీఈఓ లకు సూచించారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని హమాలీలా సమస్య విషయాన్ని చైర్మన్లు సీఈఓలు క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ స్పందిస్తూ ఏ సొసైటీ లోనైనా హమాలీలకు రైతులు ఓకే ధర చెల్లించే విధంగా చూసి కొనుగోలు ప్రారంభించాలని తెలిపారు. ఇప్పటికే దిగుబడి తక్కువ వచ్చిన రైతులు ఇబ్బందులకు గురవుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో రంగంపేట పిఏసిఎస్ చైర్మన్ అరిగే రమేష్ , కొల్చారం పీఏసీ చైర్మన్ నాగూర్ మనోహర్, వరిగంతం పిఏసిఎస్ చైర్మన్ చిన్నారపు ప్రభాకర్, సీఈఓ లు పార్థి గారికృష్ణ, చిన్నారపు రాములు, సాయిరెడ్డి ,మాజీ చైర్మన్ అచ్చన్న పల్లి నర్సింలు, మాజీ సర్పంచ్ అక్కమ్మ గారి శ్రీధర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

- దాసర్లపల్లి శివారులో తెల్లవారుజామున పోలీసుల తనిఖీలు.. ఇసుక లోడుతో ట్రాక్టర్ స్వాధీనం
- అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు: ఎస్సై పుట్ట మహేష్

ఉప్పునుంతల, (జనంసాక్షి): అక్రమ ఇసుక రవాణాకు పాల్పడుతున్న ట్రాక్టర్‌ను ఉప్పునుంతల పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా దుందుభి వాగు నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్సై పుట్ట మహేష్ తెలిపారు.





పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం (16-11-2026) తెల్లవారుజామున సుమారు 4:30 గంటల సమయంలో ఉప్పునుంతల పోలీస్ స్టేషన్‌కు చెందిన బ్లూకోల్ట్స్ సిబ్బంది రాత్రి గస్తీ విధులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో దాసర్లపల్లి గ్రామ శివారులోని దుందుభి వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించి తనిఖీ చేశారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను లింగాల మండలం కోమటికుంట గ్రామానికి చెందిన సంకి వినోద్ (31), తండ్రి చిన్న చెన్నయ్యగా గుర్తించారు. ఇసుక రవాణాకు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ఇసుక లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డ్రైవర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి చట్టపరమైన చర్యలు చేపట్టారు.
ఈ సందర్భంగా ఎస్సై పుట్ట మహేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాత్రి వేళల్లోనూ పోలీసుల గస్తీ కొనసాగుతుందని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే ఎవరినీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

పిల్లల మాటకు విలువ ఇద్దాం.. వారి అభిప్రాయాలను గౌరవిద్దాం

- బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదికగా పిల్లల ప్రజావాణి
- విద్యార్థులకు ప్రజావాణి నిర్వహణ, సమస్యల పరిష్కార విధానంపై అవగాహన
- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ బ్యూరో, నవంబర్ 16 (జనంసాక్షి): బాలల హక్కుల పరిరక్షణ, వారి సమస్యల పరిష్కారంతో పాటు అభిప్రాయాలకు ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో జిల్లాలో ప్రత్యేక పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలల దినోత్సవం, బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూనిసెఫ్ భాగస్వామ్యంతో **'నా రోజు.. నా హక్కులు.. నా భవిష్యత్'** నినాదంతో ఈ కార్యక్రమం చేపట్టారు.
ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ విద్యార్థుల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠశాలల్లో, నివాస ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. విద్యార్థుల అభిప్రాయాలను శ్రద్ధగా విని వినతులను పరిశీలించారు.
అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి సోమవారం జిల్లా, మండల స్థాయిల్లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వివరించారు. వివిధ శాఖల అధికారులు నిర్వహించే బాధ్యతలు, సమస్యల పరిష్కార విధానాన్ని విద్యార్థులకు తెలియజేశారు. పిల్లల అభిప్రాయాలను గౌరవిస్తూ వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్, ఏవో యూనస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని మేఘనకు ఘన సన్మానం



వనపర్తి బ్యూరో, నవంబర్16 (జనంసాక్షి): అండర్-14 బాలికల వాలీబాల్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ప్రతిభ చాటిన పెద్ద గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జి. మేఘనను డీసీసీ చీఫ్, శాట్స్ చైర్మన్ శివసేన రెడ్డి అభినందించి ఘనంగా సన్మానించారు. సోమవారం తన నివాసంలో మేఘనను శాలువాతో సత్కరించి, ఆమె ప్రతిభను ప్రశంసించారు.ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు సంగారెడ్డిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు మేఘన ఎంపిక కావడం పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో అపారమైన క్రీడా ప్రతిభ దాగి ఉందని, వారికి సరైన ప్రోత్సాహం, శిక్షణ, అవకాశాలు కల్పిస్తే రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించగలరని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపైనా ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. మేఘన భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, పీడీ శేఖర్, బ్రహ్మచారి, శివకుమార్, బుచ్చిబాబు, రాములు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ మళ్లీ
సీఎం కావాలని మౌన యాత్ర



మక్తల్, నవంబర్ 16 (జనంసాక్షి): కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు రుద్రసముద్రం రామలింగం మౌన యాత్ర ప్రారంభించారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి దీవెనలతో ఆయన నివాసం నుంచి యాత్ర ప్రారంభమైంది.
ఈ సందర్భంగా రామలింగం మాట్లాడుతూ కేసీఆర్ మళ్లీ సీఎం అయితేనే పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతాయని అన్నారు. రైతులు, వృద్ధులు, మహిళల సంక్షేమానికి కేసీఆర్ పాలన అవసరమని పేర్కొన్నారు. మొత్తం 15 నియోజకవర్గాల్లో 600 కిలోమీటర్ల మేర యాత్ర కొనసాగుతుందని, మార్గమధ్యంలోని 60 దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు.
రైతులకు సాగునీరు, విద్యుత్, రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు.

కారు ఢీకొని
వ్యక్తి మృతి.. డ్రైవర్ పరారీ



సంగారెడ్డి, నవంబర్ 16 (జనంసాక్షి):
కంది గ్రామ పరిధిలోని పట్నం హైవే రెస్టారెంట్ సమీపంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మునుగాల నర్సింలు (53) మృతి చెందారు. ఉదయం సుమారు 10:40 గంటల సమయంలో రోడ్డు పక్కన నిలబడి ఉన్న నర్సింలును గుర్తుతెలియని కారు డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన నర్సింలు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ కారుతో సహా అక్కడి నుంచి పరారయ్యాడు.
సమాచారం అందుకున్న మృతుడి కుమారుడు దుర్గేష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం 108 అంబులెన్స్ ద్వారా సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న కారు డ్రైవర్ కోసం దర్యాప్తు చేపట్టారు.

శివాయిపల్లిలో
భూ రీసర్వే పనుల పరిశీలన



రామాయంపేట, నవంబర్ 16 (జనంసాక్షి): మెదక్ జిల్లా రామాయంపేట మండలం శివాయిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీసర్వే పనులను రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న తీరును, భూముల హద్దులు, రెవెన్యూ రికార్డుల వివరాలను పరిశీలించి పనుల పురోగతిపై ఆరా తీశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రీసర్వే ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. భూముల సరిహద్దులు, విస్తీర్ణం, ఇతర వివరాల నమోదులో అప్రమత్తంగా ఉండాలని, రైతుల అభ్యంతరాలు,సందేహాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. రీసర్వే ద్వారా భూ రికార్డుల్లో స్పష్టత ఏర్పడి భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐ గౌస్, రెవెన్యూ అధికారులు,గ్రామ సర్పంచ్ మమత రవీందర్,ఉపసర్పంచ్ మమత కుమార్, మమత, గ్రామస్తులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే
ధాన్యం విక్రయించాలి: భాస్కర్ రెడ్డి



తూప్రాన్, నవంబర్ 16 (జనంసాక్షి): రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని తూప్రాన్ ఉమ్మడి మండల పీఏసీఎస్ చైర్మన్ ఉమన్నగారి భాస్కర్ రెడ్డి సూచించారు. ఆయన ఆధ్వర్యంలో తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని అయ్యప్ప దేవస్థానం వద్ద వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నర్సింగరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

684 టన్నుల ఏకశిలతో భారీ నందీశ్వర విగ్రహం



- రూ.9 కోట్ల వ్యయంతో నిర్మాణం
- శిలా పనులకు జగ్గారెడ్డి, నిర్మల శ్రీకారం
- మహాక్రతువులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: జగ్గారెడ్డి

సంగారెడ్డి, నవంబర్ 16 (జనంసాక్షి):
సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ప్రాంగణంలో రూ.9 కోట్ల వ్యయంతో నిర్మించనున్న భారీ సువర్ణ శృంగ నందీశ్వర స్వామి ఏకశిలా విగ్రహ నిర్మాణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, టీజీఐఐసీ మాజీ చైర్‌పర్సన్ నిర్మల ప్రత్యేక పూజలు నిర్వహించి శిలా పనులను ప్రారంభించారు.
శ్రీ జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకులు మహేశ్వర శర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో శ్రీ కైలాస ప్రస్తార మహామేరు ప్రాజెక్టులో భాగంగా ఈ నిర్మాణం చేపడుతున్నారు. సంగారెడ్డి సమీపంలోని ఎర్దనూర్ గుట్టల నుంచి 684 టన్నుల బరువున్న భారీ ఏకశిలను సేకరించారు. 32 అడుగుల పొడవు, 19.5 అడుగుల ఎత్తు, 14 అడుగుల వెడల్పు కలిగిన ఈ శిలతో నందీశ్వర స్వామి విగ్రహాన్ని రూపొందించనున్నారు. ప్రత్యేకంగా తయారుచేసిన 284 చక్రాల భారీ వాహనంపై ఈ శిలను త్వరలో విద్యాపీఠానికి తరలించనున్నారు.
ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ... మహేశ్వర శర్మ సిద్ధాంతి చేపట్టిన ఈ మహత్తర ఆధ్యాత్మిక కార్యక్రమం సంగారెడ్డి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువస్తుందని అన్నారు. ఇంతటి భారీ నందీశ్వర విగ్రహ నిర్మాణానికి సంకల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ మహాక్రతువు విజయవంతం కావడానికి ప్రజలు, భక్తులు, దాతలు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. తాను కూడా వ్యక్తిగతంగా సహాయం అందిస్తానని, విద్యాపీఠం అభివృద్ధికి ప్రభుత్వపరంగా అవసరమైన నిధులు తీసుకువచ్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విగ్రహ నిర్మాణం పూర్తయితే ఫసల్‌వాది ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు.
అనంతరం మహేశ్వర శర్మ సిద్ధాంతి మాట్లాడుతూ నందీశ్వర విగ్రహ నిర్మాణ ప్రత్యేకతలు, శ్రీ కైలాస ప్రస్తార మహామేరు ప్రాజెక్టు ఆధ్యాత్మిక ప్రాధాన్యతను వివరించారు.
ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, కాంగ్రెస్ నాయకులు, విద్యాపీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పిఆర్‌జిటీఏ సిద్ధిపేట
జిల్లా అధ్యక్షుడిగా జాలిగామ నవీన్ ఏకగ్రీవ ఎన్నిక



కోహెడ, నవంబర్ 15 (జనంసాక్షి): ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ గురుకుల టీచర్స్ అసోసియేషన్ సిద్ధిపేట జిల్లా నూతన అధ్యక్షుడిగా కోహెడ గురుకుల పాఠశాల లో విధులు నిర్వహిస్తున్న జాలిగామ నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా జి . రఘురామ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కే.చంద్రకాంత్, కరుణాకర్, అసోసియేట్ అధ్యక్షులుగా రమాదేవి, సాయిచంద్, ఎం.అశోక్, గౌరవ అధ్యక్షులుగా మహిపాల్ రెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్ రెడ్డి, కార్యదర్శులుగా రాధిక, కే . యాదగిరి, కే.నరేందర్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఏ.బాబు, డి.కరుణాకర్ రెడ్డి, పి. రవి కుమార్, ఎన్.నవీన్ కుమార్, ఎన్.నరేష్, ఎం. చైతన్య, కే.వాహితి, ఎన్.చంద్రకళ, బి.కవిత, జి. సునంద, ఎన్.సత్యలక్ష్మి, షేక్ సాజిద్, ఈ. వెంకటరెడ్డి, ఎం.రంజిత్ కుమార్, డా.ఆర్. కుమారస్వామి, మనోజ్ గౌడ్, ఏ . బిక్షపతి, డి . బాలయ్య, జి. బిక్షపతి, డా.బి.రవి, టీ. రామ్మోహన్ తదితరులు ఎన్నికయ్యారు.
అనంతరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం రమేష్ గౌడ్ మాట్లాడుతూ... అన్ని యాజమాన్యాల గురుకుల ఉపాధ్యాయుల హక్కులు, సంక్షేమం, ఆత్మగౌరవ పరిరక్షణే పి ఆర్ జి టీ ఏ లక్ష్యమని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు వేమిరెడ్డి దిలీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులపై బోధనేతర పనిభారాన్ని తగ్గించడం, కామన్ డైరెక్టరేట్ ఏర్పాటు, 010 పద్దు ద్వారా జీతాలు, హెల్త్ కార్డులు, కేర్‌టేకర్ల నియామకం వంటి డిమాండ్ల సాధనకు సంఘం నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డా. నిర్మలానందం, పానుగంటి విజయ్ కుమార్, కమతం నాగేశ్వరరావు, గాజుల నరేష్, జమ్ముల ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సింగీతంలో ఇందిరమ్మ గృహప్రవేశ వేడుకలు

- నూతన ఇంటి నిర్మాణానికి భూమి పూజ



రాయికోడు, నవంబర్ 16, (జనంసాక్షి): రాష్ట్ర వైద్యా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఆదేశాల మేరకు ఆందోల్ నియోజకవర్గం రాయికోడ్ మండలం సింగీతం గ్రామంలో నూతన ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులు శాంతప్ప గృహప్రవేశ కార్యక్రమాన్ని సోమవారం ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా సొంతింటి కలను సాకారం చేసుకున్న పేద కుటుంబాల్లో సంతోషం వెల్లివిరిసింది.ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతోమంది జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోంది. అదేవిధంగా గ్రామానికి చెందిన చంద్రయ్య నూతన ఇంటి నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఏ ప్రభాకర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎండి రఫీ, సింగీతం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సాజిద్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మూస పటేల్, నియోజకవర్గం కురుమ సంఘం అధ్యక్షులు రాజు (కురుమ) శంకరయ్య స్వామి, వీరేశం, సతీష్, పాండు, రాంరెడ్డి,రాజు జఫ్ఫు అఫ్సర్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మోహన్, పలువురు కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



భారీగా ఆదాయం రూ.2.76 కోట్లు



పాపన్నపేట, నవంబర్ 16 (జనంసాక్షి): మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గమ్మ దేవస్థానానికి వివిధ రూపాల్లో రూ. 2.76 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. దేవస్థానంలో వివిధ విభాగాల నిర్వహణ హక్కుల కోసం ఆలయ అధికారులు సోమవారం సీల్డ్ టెండర్లు కంబహిరంగ వేలం పాట నిర్వహించారు. 2027 ఏడాది సంవత్సరం కు గాను కార్యాలయంలో ఈ వేలం పాట సందడిగా సాగింది. కొబ్బరికాయల విక్రయ హక్కు..ఆలయ ఆవరణలో కొబ్బరికాయలు అమ్ముకునే హక్కును మెదక్ పట్టణానికి చెందిన డి.లింగోజి అత్యధికంగా రూ. 1.21.10.000 లకు దక్కించుకున్నారు. ఒడి బియ్యం సేకరణ హక్కు.. అమ్మవారికి భక్తులు సమర్పించే ఒడి బియ్యాన్ని పోగు చేసుకునే హక్కును నాగ్సన్‌పల్లికి చెందిన ఎస్. బాలరాజ్ రూ. 1.13.10.000 లకు సొంతం చేసుకున్నారు. పూజా సామాగ్రి విక్రయ హక్కు.. ఆలయం వద్ద పూజా సామాగ్రి విక్రయించే హక్కును నాగ్సన్‌పల్లికి చెందిన బి.నర్సాగౌడ్ రూ. 34.50.000లకు పొందారు. పాదరక్షల భద్రపరిచే స్థలం..భక్తుల పాదరక్షలు భద్రపరిచే స్టాండ్ నిర్వహణ హక్కును నాగ్సన్‌పల్లికి చెందిన ఎం.దుర్గాగౌడ్ రూ. 7.30.000 లకు దక్కించుకున్నారు. మిగిలిన 3 విభాగాల టెండర్లకు టెండర్ దారుల నుండి ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో వాయిదా వేశారు. ఆలయ ఈఓ మఠం వీరేశం,దేవాదాయ శాఖ పర్యవేక్షకులు రంగారావు,ఆలయ సిబ్బంది శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.

సిర్గాపూర్‌లో
చేయూత పెన్షన్ పత్రాల పంపిణీ

- ఈ నెల 17న మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు - ఎంపీడీవో అండాలమ్మ



సిర్గాపూర్, నవంబర్ 16 (జనంసాక్షి): సిర్గాపూర్ మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ నెల 17న మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అండాలమ్మ తెలిపారు.
ఈ కార్యక్రమానికి మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, పత్రికా విలేకరులు, ఆహ్వానితులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

అర్హులైన పేదలందరికీ చేయూత పింఛన్లు: మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి

- నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- నర్సాపూర్‌లో 3,775 మంది లబ్ధిదారులకు పింఛన్ పత్రాల పంపిణీ



నర్సాపూర్ నవంబర్ 16 (జనంసాక్షి): అర్హులైన పేదలందరికీ చేయూత పింఛన్లు అందించి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వం లోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిస్తూ పాలన సాగిస్తోందని పేర్కొన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో నర్సా పూర్ నియోజకవర్గానికి చెందిన నూతన చేయూత పింఛన్ లబ్ధిదారులకు మంత్రి పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ నగేశ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చేయూత పింఛన్లను అందిస్తోందన్నారు. ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 3,775 మంది లబ్ధిదారులకు పింఛన్లు మంజూరయ్యాయని వెల్లడించారు. వీరిలో 128 మంది కల్లుగీత కార్మికులు, 602 మంది దివ్యాంగులు, 2,635 మంది వితంతువులు, 366 మంది ఒంటరి మహిళలు ఉన్నట్లు వివరించారు. నిరుపేద కుటుంబాలకు చేయూత పింఛన్లు ఎంతో ఆసరా గా నిలుస్తున్నాయని పేర్కొ న్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సహకారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా లబ్ధిదారులు బేస్‌మెంట్ స్థాయి నిర్మాణం పూర్తిచేసిన అనంతరం ప్రభు త్వం నిర్ణీత విడతల్లో బిల్లులను చెల్లిస్తుం దని మంత్రి తెలిపారు. నిరుపేద కుటుంబాలు ఇళ్లు నిర్మించుకునేందుకు బ్యాంకులు రుణాలు అందించేం దుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తోందని చెప్పారు.

ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. వివిధ కార్పొరేషన్ల ద్వారా కార్లు, ట్రాక్టర్లు పొందిన అర్హులైన లబ్ధిదారులకు కూడా పింఛన్లు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, ఆర్డీవో రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజు యాదవ్, వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మర్పడగ సంతాన మల్లికార్జున స్వామి సన్నిధిలో మాజీ ముఖ్యమంత్రి సతీమణి శోబమ్మ



కొండపాక, నవంబర్, 16 (జనంసాక్షి): కొండపాక మండలం మార్పడగ గ్రామంలో మాజీ ముఖ్య మంత్రి కల్వకుంట్ల చంద్ర శేఖర రావు సతీమణి కె శోభమ్మ సంతాన మల్లికార్జు న స్వామి దేవాలయంలో శ్రీ సంతానమల్లికార్జున స్వామినీ దర్శించుకున్న అనంతరం ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని ఆలయ ధర్మకర్త మండలి అర్చకులు తెలిపారు.

బీరంగూడలో ప్రత్యేక పూజలు



అమీన్పూర్, నవంబర్ 16 (జనంసాక్షి): బీరంగూడ గుట్టపై ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీక మాసం మొదటి సోమవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారు జామున 4 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారుజాము నుంచే క్యూ లైన్ లలో వేచి ఉన్నారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలతో పాటు అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ ప్రాంగ ణంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుధాకర్ యాదవ్ తెలిపారు.

అన్నారం ప్రభుత్వ పాఠశాలలో షీ బాక్స్ ఏర్పాటు



గుమ్మడిదల, నవంబర్ 16 (జనం సాక్షి): మహిళలు, బాలికల భద్రత కు ప్రాధాన్యతనిస్తూ ఎస్పీ ఆదేశాల మేరకు గుమ్మడిదల మండలం లోని పాఠశాలలు, కళాశాలల్లో షీ బాక్స్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అన్నారం ప్రభుత్వ పాఠశాలలో షీ బాక్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అరుణ్ కుమా ర్ విద్యార్థినులకు షీ బాక్స్ వినియోగంపై అవగాహన కల్పిం చారు. వేధింపులు, ఇతర సమస్యలను లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని, ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకుంటా మని తెలిపారు. బాలికలు ఎలాంటి భయం లేకుండా సమస్య లను వెల్లడించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

దిగ్వాల్ విద్యార్థినికి రూ.లక్ష నగదు బహుమతి





కోహీర్, నవంబర్ 16 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం దిగ్వాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఆల్మాస్ తంకీన్ 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి జహీరాబాద్ తాలూకా స్థాయిలో ప్రతిభ కనబరిచింది. ఆమె ప్రతిభను గుర్తించిన శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థ రూ.లక్ష నగదు బహుమతిని అందజేసింది. సోమవారం పాఠశాలలో నిర్వహించిన ప్రార్థనా సమావేశంలో సంస్థ మేనేజర్ ప్రవీణ్ విద్యార్థినికి లక్ష రూపాయల చెక్కును అందించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోహీర్ మండల విద్యాధికారి ఎం. జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కూడా పట్టుదల, క్రమశిక్షణతో ఉన్నత స్థాయిలో రాణించగలరని ఆల్మాస్ నిరూ పించిందన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకుని ఇతర విద్యార్థులు కూడా కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ప్రతిభావంతులను ప్రోత్సహించిన శ్రీరామ్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొని ఆల్మాస్‌ను అభినందించారు.

రాయికోడ్ మండలానికి 584 పింఛన్ల మంజూరు

- నేడు పంపిణీ చేయనున్న మంత్రి దామోదర్





రాయికోడు, నవంబర్ 16(జనంసాక్షి): రాయికోడు మండలానికి 584 నూతన పింఛన్లు మంజూరైనట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జి అంజయ్య, మం డల కాంగ్రెస్ అధ్యక్షులు పి కేదార్నాథ్ పాటిల్ తెలి పారు. 437 వీడో, 82 వికలాంగులు 58 ఒంటరి మహిళలు, గీత కార్మికులకు 7, మొత్తం 584 పింఛ న్లు మంజూరైనట్లు చెప్పారు. ఈనెల 17న ఉదయం మండల కేంద్రమైన మునిపల్లిలోని ఎస్ ఆర్ ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించనున్న నూతన పింఛన్ల పంపిణి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొని లబ్ధిదారులకు మంజూరూ పత్రాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.ఆయా గ్రామాల్లోని సర్పంచులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, లబ్ధిదారులందరూ అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

కొల్చారం మండల శాఖ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక





కొల్చారం, నవంబర్16(జనంసాక్షి): కొల్చారం మండల శాఖ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కౌన్సిలర్ ఎన్నికల అధికారి వి.సంగయ్య, జిల్లా అధ్య క్షుడు కె. యాదగిరి ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరిం చారు. ఈ ఎన్నికల్లో మండల నూతన అధ్యక్షుడిగా ఎల్. పీర్ సింగ్ (జెడ్పీహెచ్ఎస్ వరిగుంతం), ప్రధాన కార్యదర్శిగా పి. యాదగిరి (పీ.ఎస్. సీతారాం తండా) ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బి. జీవరత్నం, కమల, లక్ష్మయ్య, కార్యదర్శులుగా యాదగిరి, రాజు, సౌమ్య, జిల్లా కౌన్సిలర్లుగా కె. గౌడ్, వి. జగదీశ్వర్, వి. వీర్ కుమార్ చారిలను ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కె. యాదగిరి, రాష్ట్ర కౌన్సిలర్ వి. సంగయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు 55 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిల చెల్లింపుల కోసం నెల వారి రూ.2 వేల కోట్ల చొప్పున నిధులు విడుదల చేయాలని, నిలిచిపోయిన బకాయిలను తక్షణమే మంజూరు చేయాలని కోరారు. అదేవిధంగా ఉద్యోగులకు ఇబ్బందులు కలిగిస్తున్న జీవో 25ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొండపాక మండలంలో వడ్ల కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవం



కొండపాక, నవంబర్, 16(జనంసాక్షి): కొండపాక మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వెలికట్ట, దుద్దేడ, ధమక్కపల్లి, సిరిసినగండ్ల, మర్పడ గలో వడ్ల కొనుగోలు కేంద్రాలను పిఏసిఎస్ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి ప్రారంభించారు.అనంతరం చిట్టి దేవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విరూపాక్ష శ్రీనివాస్ రెడ్డి తో కలిసి మాట్లాడుతూ వడ్లను దళాలకు అమ్మకుండా ప్రభుత్వ నిర్ణయించిన ధరకే మార్కెట్లో అమ్ముకోవాలని రైతులు మోసపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలోసిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీ బైరు ప్రణీత్ రెడ్డి, ఉప సర్పంచ్ ఎర్ర నర్సింలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్య క్షుడు మంచాల కనకరాములు, కొండపాక గ్రామ శాఖ అధ్యక్షుడు జంజీరపు నర్సింలు, పిఏసిఎస్ డైరెక్టర్లు కె.కృష్ణమూర్తి, బి. సురేం దర్ రావు ఏఎంసి డైరెక్టర్లు, కొండపాక పాలకవర్గ సభ్యులు, మండల వ్యవసాయ అధికారులు, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులు నిలిపివేయాలి



కొల్చారం, నవంబర్ 16 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్‌మెంట్, డిప్యూటేషన్ పేరుతో ఇతర పాఠశాలలకు పంపించడంపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కొల్చారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి పలువురు ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు, మండలాలకు బదిలీ చేయడం వల్ల విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. వెంటనే వర్క్ అడ్జస్ట్‌మెంట్ ఉత్తర్వులను నిలిపివేసి, ఉపాధ్యాయులను యథాస్థానంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకంతో పిల్లలను చేర్పించిన తమకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని కోరారు.

శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం



ఉప్పునుంతల (జనంసాక్షి): శ్రీశైలం-హైదరాబాద్ జాతీయ రహదారి 765పై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో బోల్తాపడి పలువురు గాయపడ్డారు. ఈరట్వానిపల్లి గేట్ సమీపంలోని జియో పెట్రోల్ బంక్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన హ్యుందాయ్ ఎక్సెటర్ కారు ఆటోను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. మాగాని చెన్నయ్య కుటుంబ సభ్యులు ఆటోలో ప్రయాణిస్తుండగా ఘటన చోటుచేసుకుంది. అదే కారు మరో ద్విచక్ర వాహనాన్ని కూడా ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ శ్రీకాంత్ తులసీదాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పుట్ట మహేష్ తెలిపారు. వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలని పోలీసులు సూచించారు.

ఐదేళ్లలోపు
చిన్నారులందరికీ చుక్కలు వేయించాలి

• అదనపు కలెక్టర్ సంగీత

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 16 (జనంసాక్షి): జిల్లాలో నవంబర్ 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ సంగీత అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నవంబర్ 22న పోలియో కేంద్రాల్లో, 23, 24 తేదీల్లో కేంద్రాలకు రాని చిన్నారులకు ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయాలని సూచించారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కేంద్రాలు పనిచేయాలని, గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లలితాదేవి, జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి, విద్యాశాఖ అధికారి రోహిణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి: అదనపు కలెక్టర్ సంగీత

బాలల ప్రత్యేక ప్రజావాణికి 50 అర్జీలు

సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 16 (జనంసాక్షి): బాలల హక్కుల పరిరక్షణతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అదనపు కలెక్టర్ సంగీత ఆదేశించారు. బాలల నుంచి వచ్చిన అర్జీలను ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సూచించారు.

తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో సాధారణ ప్రజావాణితో పాటు బాలల ప్రత్యేక ప్రజావాణి నిర్వహించారు. **'నా రోజు.. నా హక్కులు.. నా భవిష్యత్తు'** అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంగీత, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారితో కలిసి బాలల నుంచి 50 అర్జీలను స్వీకరించారు.

జిల్లాలోని పట్టణ, గ్రామీణ, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చిన బాలలు తమ సమస్యలను అధికారుల



దృష్టికి తీసుకువచ్చారు. దివ్యాంగులకు పింఛన్లు మంజూరు చేయాలని, పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, మౌలిక వసతులు, ప్రహరీ గోడలు కల్పించాలని కోరారు. మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని, గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు కల్పించాలని అర్జీలు సమర్పించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ.. బాలలకు మెరుగైన భవిష్యత్తును అందించడం, వారి హక్కులను పరిరక్షించడం, సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే ప్రత్యేక ప్రజావాణి ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్య, వైద్యం, రక్షణతో పాటు బాలలకు సమాన అవకాశాలు కల్పించే



లా అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బాలల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ వారి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. బాలలకు సురక్షితమైన, ఆహ్లాదకరమైన విద్యా వాతావరణం కల్పించేందుకు శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ లలితాదేవి, జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి, జిల్లా బాలల సంరక్షణ అధికారి రత్నం, బాలల సహాయవాణి సమన్వయకర్త యాదగిరి, లింగం, సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో పేదల సొంతింటి కల నెరవేరుతుంది

• సీడీసీ చైర్మన్ గడిల రాంరెడ్డి

సదాశివపేట, నవంబర్ 16(జనంసాక్షి): కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యమని సీడీసీ చైర్మన్ గడిల రాంరెడ్డి అన్నారు. సోమవారం సదాశివ పేట మండలం వెల్టూరు గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులతో కలిసి ఆయన భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా గడిల రాంరెడ్డి మాట్లాడుతూ, ప్రజా పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను విడతల వారీగా అమలు చేస్తోందని తెలిపారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఇళ్లు అందించకుండా కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. వెల్టూర్ గ్రామానికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లు 27 మందికి లబ్ధిదారులకు మంజూరు అయినయి అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బగ్గ శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కర్ణం సందీప్, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు మల్లికార్జున్, సర్పంచులు మగ్దూం పటేల్, మోహన్ గౌడ్, ఇందూరి భారతమ్మ బాబు, విజయలక్ష్మి శివానంద గౌడ్, తులసి సత్యనారాయణ, గ్రామపంచాయతీ కార్యదర్శి అనిల్, గ్రామ శాఖ అధ్యక్షుడు నవీన్, వార్డు సభ్యులు కాంగ్రెస్ నాయకులు తొంట రాజు,కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఖాదర్ మొహియోద్దీన్‌కు జాతీయ సేవారత్న అవార్డు



అమీన్‌పూర్, నవంబర్ 16 (జనంసాక్షి): ప్రముఖ స్వచ్ఛంద సేవకుడు ఖాదర్ మోహియోద్దీన్‌కు న్యూఢిల్లీలో జాతీయ సేవారత్న అవార్డు ప్రదానం చేశారు. బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన 20వ జాతీయ సదస్సులో అవార్డు, జ్ఞాపిక అందజేశారు. బీహెచ్ఈఎల్‌లో భద్రతాధికారిగా పదవీ విరమణ చేసిన ఆయన గత 12 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, మహిళలకు గృహ భద్రత, ప్రజలకు సీపీఆర్, కార్మికులకు పరిశ్రమల భద్రతపై శిక్షణ ఇస్తూ వేలాది మందికి అవగాహన కల్పించారు. ఆయన సేవలను అకాడమీ ప్రతినిధులు అభినందించారు.

తెలంగాణలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే



మిడ్జిల్, నవంబర్ 16 (జనంసాక్షి): తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని పిలుపునిచ్చారు.

మిడ్జిల్ మండలంలోని వివిధ మోర్చాలకు పూర్తిస్థాయి కమిటీలతో పాటు మండల కమిటీ సభ్యుల నియామకంపై ఆదివారం మండల అధ్యక్షుడు నరేష్ నాయక్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ దేశహితమే లక్ష్యంగా పనిచేస్తున్న బీజేపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు.జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మాజీ యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి మాట్లాడుతూ పార్టీ అభివృద్ధిలో వివిధ మోర్చాల పాత్ర కీలకమని, కష్టపడి పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని తెలిపారు.

ఈ సమావేశంలో కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి వెంకట్ రెడ్డి, రామకృష్ణ, ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శి ఎల్లయ్య, మండల ప్రధాన కార్యదర్శులు వాసుదేవ్, శేఖర్, ఉపాధ్యక్షులు దామోదర్ రెడ్డి, నాగేష్, కోశాధికారి భీమయ్య, యువ మోర్చా అధ్యక్షుడు విష్ణు వర్ధన్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఆంజనేయులు, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కావాలి నరేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు షాహాది బేగం, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు శేఖర్, సైదులుతో పాటు బూత్ అధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు పాల్గొన్నారు.

జాతీయ పత్రికా
దినోత్సవం సందర్భంగా జర్నలిస్టులకు సన్మానం

కోహీర్, నవంబర్ 16(జనంసాక్షి): జాతీయ పత్రికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కోహీర్ పట్టణంలో మండల జర్నలిస్టులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. మున్సిపల్ టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ ముజఫర్ హుస్సేన్ జర్నలిస్టులకు శాలువాలు కప్పి, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, మౌలిక వసతుల కొరత వంటి అంశాలను వెలుగులోకి తీసుకువస్తూ జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఒత్తిళ్లకు తలొగ్గకుండా నిష్పక్షపాతంగా వార్తలు అందిస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న జర్నలిస్టుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ముజఫర్ హుస్సేన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్, వైస్ చైర్మన్ అబ్దుల్ హన్నాన్ జావేద్, మాజీ వైస్ చైర్మన్ షాకీర్ అలీ, మజ్లిస్ మండల అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, దిగ్వాల్ సర్పంచ్ అహ్మద్ అలీ, యూసుఫ్ పటేల్ పాల్గొన్నారు.



జింక పిల్లను కాపాడి అటవీ అధికారులకు అప్పగింత

సిర్గాపూర్, నవంబర్ 16 (జనంసాక్షి): మండలంలోని చందర్ నాయక్ తండా పరిధి మున్నా తండాలో కుక్కలు వెంబడిస్తున్న జింక పిల్లను గ్రామస్తులు రక్షించారు. జీవ వైవిధ్య కమిటీ, సర్పంచ్ రుక్మిణి బాయి పుల్సింగ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు జింక పిల్లను కాపాడి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కృష్ణకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంతోషి బాయి రాంసింగ్, ఉపసర్పంచ్ థావుర్, పంచాయతీ కార్యదర్శి రఘురాం, గ్రామస్తులు లక్ష్మణ్, శ్రీను, భద్దు, రమేష్, సంతోష్ పాల్గొన్నారు. జింక పిల్లను కాపాడిన గ్రామస్తులను పలువురు అభినందించారు. వన్యప్రాణులను రక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతని సర్పంచ్ పేర్కొన్నారు.



అర్హులైన ప్రతి ఒక్కరికీ
ఆసరా.. పేదలకు పెన్షన్ల భరోసా

• మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పట్లోళ్ల మల్లారెడ్డి



సంగారెడ్డి, నవంబర్ 15 (జనంసాక్షి): పేదలు, వృద్ధులు, చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పట్లోళ్ల మల్లారెడ్డి అన్నారు. సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి ఎక్స్‌రోడ్డు సమీపంలోని పీఎస్ఆర్ గార్డెన్స్‌లో అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. మండల పరిధిలోని మొత్తం 683 మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందజేయగా, సైదాపూర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళలకు నెలకు రూ.2,016, దివ్యాంగులకు రూ.4,016 చొప్పున పెన్షన్లు అందిస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్, ప్రవీణ్, మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

కోహిర్ మున్సిపాలిటీలో 135 మందికి చేయూత పింఛన్లు మంజూరు

అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ.. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం





కోహిర్, నవంబర్ 16 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా కోహిర్ మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన 135 మంది లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత ఆసరా పింఛన్లు మంజూరు చేసింది.

ఈ మేరకు ఆదివారం కోహిర్ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు పత్రాలు, రసీదులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్ల సమక్షంలో మొత్తం 135 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. దీంతో పింఛన్ల కోసం ఎదురు చూస్తున్న అర్హులకు సామాజిక భద్రత కల్పించే దిశగా ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసింది.

ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ చేయూత ఆసరా పింఛన్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేదలు, ఇతర అర్హులైన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు వారి జీవనానికి చేయూత అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శశిధర్, సూచించారు.

పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిన కోడి పంచాయితీ...

- **కోడిని కారుతో ఢీకొట్టి చంపి ప్రశ్నించిన యజమానిపై దాడికి యత్నం..!**
- **బాధితుడికి బెదిరింపులు..**
- **కారు యజమానిపై చేర్యాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు**



చేర్యాల, నవంబర్ 16 (జనంసాక్షి): కారు ఢీ కొని కోడి చనిపోయిన పంచాయతీ ఘటన వివాదానికి దారితీసింది. మండలం లోని ఆకునూరు గ్రామానికి చెందిన పౌడాల రాములు పెంచుకుంటున్న కోడిని సోమవారం టీఎస్ 36 క్యూ 0807 నంబర్ గల కారు ఢీకొట్టడంతో కోడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై కారు యజమాని మల్లోజు రవికుమార్‌ను బాధితుడు రాములు ప్రశ్నించగా, దురుసుగా సమాధానమిస్తూ బెదిరింపులకు పాల్పడ్డాడని, అంతేకాకుండా తనపై దాడికి ప్రయత్నించాడని బాధితుడు ఆరోపించారు. నువ్వు ఏం చేసుకుంటావో చేసుకో.. పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటే వెళ్లుకో అంటూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బాధితుడు పౌడాల రాములు చేర్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన కోడిని కారుతో ఢీకొట్టి చంపడమే కాకుండా, న్యాయం అడిగిన తనను బెదిరించడంపై బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

మృతుని కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం



చేర్యాల, నవంబర్ 16 (జనంసాక్షి): చేర్యాల పట్టణంలోని 1వ వార్డుకు చెందిన మిట్టపల్లి నారాయణరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి తరపున సోమవారం పట్టణ బీఆర్ఎస్ నాయకులు మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముస్త్యాల అరుణ బాలనర్సయ్య, పట్టణ అధ్యక్షుడు ముస్త్యాల నాగేశ్వరరావు, మాజీ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూప రాణి శ్రీధర్ రెడ్డి, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ పూర్మ వెంకట్ రెడ్డి, బురగోని తిరుపతి గౌడ్, మంచాల కొండయ్య, ఆవుశర్ల కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నారం శివారులో వ్యక్తి మృతి



గుమ్మడిదల, నవంబర్ 16 (జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం శివారులోని బీఎస్ఆర్ ఇటుక బట్టీ ప్రాంగణంలో ఒడిశాకు చెందిన కాంతా నాయిల్ (31) సోమవారం మృతిచెందాడు. గత రెండు వారాలుగా భార్య అంజలితో కలిసి అక్కడ కూలీ పనులు చేస్తున్నాడు. ఆదివారం రాత్రి భార్యతో గొడవపడి బయటకు వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. సోమవారం ఉదయం ఇటుక బట్టీ ప్రాంగణంలోని వేపచెట్టుకు వేలాడుతూ మృతదేహంగా కనిపించాడు. మృతుడి బంధువు బినోద్ నాయిల్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ అరుణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముస్త్యాలలో వీధి దీపాల ఏర్పాటు



చేర్యాల, నవంబర్ 16 (జనంసాక్షి): చేర్యాల మండలం లోని ముస్త్యాల గ్రామంలో సోమవారం నూతన ఎల్ ఈడీ వీధి దీపాల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పలు వార్డుల్లో అస్తవ్యస్తంగా ఉన్న పాత లైట్ల స్థానంలో నూతన ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు 12వ వార్డు సభ్యుడు బండారి సతీష్ తెలిపారు. దీంతో రాత్రి వేళల్లో ప్రజలకు ఇబ్బందులు తొలగిపోనున్నాయి. వీధి దీపాల ఏర్పాటుతో రాత్రిపూట ప్రయాణం సురక్షితంగా ఉంటుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రబీలో వరి సాగు వద్దు.. ఆరుతడి పంటలే ముద్దు!

- **వరి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు**
- **నిల్వ ఉన్న విత్తనాలను కంపెనీలకు తిరిగి పంపించాలి**
- **రైతులకు అధికారుల సూచన**



పెద్దశంకరంపేట, నవంబర్ 16 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో రానున్న రబీ సీజన్‌లో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉన్నందున రైతులు వరి సాగుకు దూరంగా ఉండి ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని అధికారులు సూచించారు. మెదక్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం పెద్దశంకరంపేట లోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో రెవెన్యూ, వ్యవ సాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ నారాయణ మాట్లాడుతూ... తక్కువ వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అధిక నీటి అవసరమయ్యే వరి సాగు చేపట్టవద్దని రైతులకు సూచించారు. దుకాణాల్లో నిల్వ ఉన్న వరి విత్తనాలను సంబంధిత కంపెనీలకు తిరిగి పంపించాలని వ్యాపారులకు ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా వరి విత్తనాలు విక్రయిస్తే దుకాణ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యవసాయ అధికారి నాగం కృష్ణ మాట్లాడుతూ... రబీ సీజన్‌లో రైతులు ముందస్తు ప్రణాళికతో పంటలు సాగు చేయాలని సూచించారు. వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగయ్యే కంది, పెసర, మినుము, జొన్న, మొక్కజొన్న తదితర ఆరుతడి పంటలను ఎంచుకోవాలని తెలిపారు. నీటి లభ్యతను బట్టి అనుకూలమైన పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. గ్రామసభల ద్వారా రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించి నష్టాలను నివారించుకోవాలని కోరారు. ఈ తనిఖీల్లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నాగరాజు పాల్గొన్నారు. దుకాణాల్లో విత్తనాలు, ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించి యజమానులకు పలు సూచనలు చేశారు.

ఎర్రవల్లి బాట పట్టిన
బీఆర్ఎస్ నేతలకు ఘన స్వాగతం



మెదక్ బ్యూరో, నవంబర్ 16 (జనంసాక్షి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఏడుపాయల నుంచి ఎర్రవల్లికి పాదయాత్ర చేపట్టిన నాయకులకు మెదక్ పట్టణంలో ఘన స్వాగతం లభించింది. వెల్కమ్ బోర్డు వద్దకు చేరుకున్న పాదయాత్ర బృందాన్ని మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పట్టణ నాయకులు ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాయకులు కేసీఆర్ పాలనలో రైతుబంధు, రైతుబీమా, మిషన్ భగీరథ, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో ప్రజలకు ప్రయోజనం కలిగిందన్నారు. ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ప్రసాదాన్ని కేసీఆర్‌కు అందించేందుకు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బట్టి ఉదయ్, దీపక్ కుమార్ పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం: వి.ఆనంద్



గుమ్మడిదల, నవంబర్ 16(జనంసాక్షి): TUWJ (143) సంఘాన్ని ఉద్యమ పంథాలో మరింత బలోపేతం చేస్తూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన జాతీయ కౌన్సిల్ సభ్యుడు వి.ఆనంద్ తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికకు సహకరించిన సంగారెడ్డి జిల్లా యూనియన్ నాయకులు, జర్నలిస్టు మిత్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. జాతీయస్థాయిలో తెలంగాణ యూనియన్ గొంతుకను వినిపిస్తూ జర్నలిస్టుల హక్కులు, వృత్తిపరమైన సమస్యలు, తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆనంద్ పేర్కొన్నారు.

2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేయాలి

- **తపాస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ నర్సిరెడ్డి**



నంగునూరు, నవంబర్ 16(జనంసాక్షి): 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి, తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు/ప్రధాన కార్యదర్శి వంగ నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నంగునూరులో జరిగిన తపస్ మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ. పాత పెన్షన్ విధానం అమలులో ఉన్నప్పుడే 2003 డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలైందని, నియామక ప్రక్రియ ఆలస్యం కావడం వల్ల ఆ బ్యాచ్ ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాగానే సీపీఎస్ రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కోరారు. లేనిపక్షంలో తపస్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో తపస్ మండల అధ్యక్షుడు కత్తుల రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ మరియు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కూల్ అటెండర్ల
సమస్యలు పరిష్కరించాలి: TUCC డిమాండ్



కంగ్టి, నవంబర్ 16 (జనంసాక్షి): పాఠశాలల్లో పనిచేస్తున్న అటెండర్ల సమస్యలను ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే పరిష్కరించాలని TUCC జిల్లా నాయకుడు చిరంజీవి డిమాండ్ చేశారు. కంగ్టి మండల కేంద్రంలో అటెండర్ల సమస్యలపై సమావేశం నిర్వహించి, ఎంపీడీవో కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజావాణిలో 19 దరఖాస్తులు అందజేశారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని, ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ.21 వేలు చెల్లించడంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని చిరంజీవి హెచ్చరించారు. కార్యక్రమంలో సిద్ధి రాములు, వెంకటరెడ్డి, చంద్రకాంత్, నల్గొండ, సక్రం, లలితమ్మ, మీరాబాయి, కిష్టమ్మ, సుశీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఐజెయూ జాతీయ, రాష్ట్ర కౌన్సిల్‌కు మెదక్ జిల్లాకు చోటు

ఒకరు జాతీయ కౌన్సిల్, నలుగురు రాష్ట్ర కౌన్సిల్‌కు ఎంపిక



మెదక్ జిల్లా నవంబర్ 16 (జనంసాక్షి): ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజెయూ) జాతీయ, రాష్ట్ర కౌన్సిల్‌కు మెదక్ జిల్లాకు ప్రాధాన్యత దక్కింది. మెదక్ జిల్లా నుంచి ఒకరు జాతీయ కౌన్సిల్‌కు, నలుగురు రాష్ట్ర కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. ఇటీవల తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (హెచ్143) రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీసాగర్‌లు నోటిఫికేషన్ విడుదల చేశారు. సీనియర్ జర్నలిస్ట్ బుచ్చన్న ఎన్నికల అధికారిగా వ్యవహరించగా మెదక్ జిల్లా నుంచి సీనియర్ జర్నలిస్ట్ పబ్బతి సురేందర్ రెడ్డి జాతీయ కౌన్సిల్ సభ్యులుగా ఎన్. గోపాల్ గౌడ్ (దిశ), దౌలయ్య (నమస్తే తెలంగాణ)మహమ్మద్ రహ్మద్ అలీ (రాజ్ న్యూస్)భువన్ కుమార్ (సాక్షి టీవీ)లు నామినేషన్లు దాఖలు చేశారు. పోటీ లేకపోవడంతో వారంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి బుచ్చన్న ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైనా జర్నలిస్ట్ నేతలు మాట్లాడుతూ జిల్లాలో జర్నలిస్టుల హక్కుల సాధన కోసం పనిచేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హెల్త్ కార్డు మాదిరిగా అర్హులైన జర్నలిస్టులందరికి హెల్త్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు, అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని తెలిపారు.తమపై నమ్మకం ఉంచి ఎన్నికకు కృషి చేసిన యూనియన్ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి,మెదక్ జిల్లాలోని జర్నలిస్టులకు ఈ సందర్భంగా వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆరేళ్లుగా నిలిచిన రహదారి పనులు.. కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- **బెజ్జంకి-బేగంపేట రహదారి పనులు పూర్తి చేయాలి**
- **సీపీఐ మండల సహాయ కార్యదర్శి సంగెం మధు**



బెజ్జంకి, నవంబర్ 16(జనంసాక్షి):
బెజ్జంకి నుంచి బేగంపేట గ్రామానికి వెళ్లే డబుల్ రోడ్డు నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి సంగెం మధు డిమాండ్ చేశారు.ఈ మేరకు సోమవారం బెజ్జంకి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజాపాలన అధికారికి సీపీఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంగెం మధు మాట్లాడుతూ బెజ్జంకి-బేగంపేట రహదారి, గుగ్గిళ్ల-తంగళ్లపల్లి మధ్య బ్రిడ్జి నిర్మాణానికి కలిపి రూ.8 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు.పనులు ప్రారంభించి మొరం, కంకర వేసిన కాంట్రాక్టర్ ఆరేళ్లకు పైగా గడుస్తున్నా నేటికీ పూర్తి చేయలేదని విమర్శించారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడటంతో పాటు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని రహదారి పనులు పూర్తిచేయాలని, లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆర్ అండ్ బీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ బెజ్జంకి గ్రామ శాఖ కార్యదర్శి కల్లూరి బాలమల్లు, నాయకుడు ఎస్. రాకేష్ పాల్గొన్నారు.

ఎల్‌నినోపై అవగాహన ర్యాలీకి టీడబ్ల్యూజే-ఐజేయూ శ్రీకారం



సంగారెడ్డి బ్యూరో (జనంసాక్షి): జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా టీడబ్ల్యూజే-ఐజేయూ సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 9 గంటలకు ఎల్‌నినో ప్రభావాలపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి తెలిపారు. సంగారెడ్డి ఐబీ నుంచి కలెక్టరేట్ వరకు ప్లకార్డులతో ర్యాలీ చేపట్టనున్నట్లు వెల్లడించారు. సామాజిక బాధ్యతలో భాగంగా ఎల్‌నినో వల్ల తలెత్తే నీటి ఎద్దడి, విద్యుత్ ఉత్పత్తి సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. 'నీటిని పొదుపు చేద్దాం.. విద్యుత్‌ను ఆదా చేద్దాం' నినాదంతో ప్రజల్లో చైతన్యం తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ ర్యాలీకి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైసల్‌తో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. జర్నలిస్టులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని యాదగిరి కోరారు.

యువత స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలి: డా. వెన్న ఈశ్వరప్ప



గండీడ్, నవంబర్ 16 (జనంసాక్షి): యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లో రాణించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు డా. వెన్న ఈశ్వరప్ప పిలుపునిచ్చారు. సోమవారం రుసుంపల్లి గ్రామానికి చెందిన బీజేపీ యువ నాయకుడు చిట్యాల యాదగిరి నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ కిరాణం అండ్ ఫోటో స్టూడియోను ఆయన ప్రారంభించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత ముందుగా ఆర్థికంగా స్థిరపడాలని, స్వయం ఉపాధితో కుటుంబాలను అభివృద్ధి చేసుకోవడంతో పాటు ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. వ్యాపార రంగంలో ముందుకు వచ్చే యువతకు అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. యాదగిరి వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.
అనంతరం గాధిర్యాల్ గ్రామంలో పాత్రికేయుడి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మూస నర్సింలు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మధ్యవర్తులు వద్దు.. నేరుగా ప్రజావాణికి రండి

ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక పర్యవేక్షణ: అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 16 (జనంసాక్షి):
జిల్లా ప్రజలకు ఈ సమస్యలు ఉన్న మధ్యవర్తులను సంప్రదించకుండా నేరుగా ప్రజావాణికి వచ్చి సమస్యలు తమ దృష్టికి తీసుకురావాలని అదరపు ఎస్పీ చైతన్య రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు . ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, బాధితులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదుల వివరాలను తెలుసుకున్నారు.
ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్థానిక పోలీస్ స్టేషన్లలో సమస్యలు పరిష్కారం కాని వారు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.
ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదుపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుందని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు పారదర్శకంగా, త్వరితగతిన న్యాయం అందించడమే జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని పేర్కొన్నారు.

కాంగ్రెస్ హామీల అమలుకు ఇంకా రెండేళ్లే గడువు

పెండింగ్‌లో ఉన్న పింఛన్లను వెంటనే మంజూరు చేయాలి: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి, నవంబర్ 16 (జనంసాక్షి):
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న పింఛన్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించి అర్హులైన వారికి మంజూరు చేయాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన నూతన పింఛన్ల మంజూరు పత్రాలు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఆయన హాజరై లబ్ధిదారులకు పత్రాలు, చెక్కులు అందజేశారు.
ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్నా ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు కాలేదని విమర్శించారు. హామీల అమలుకు ఇంకా రెండేళ్ల గడువు మాత్రమే ఉందని పేర్కొన్నారు. కొత్త పింఛన్ల మంజూరులో ఆలస్యం జరిగిందని, ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి అర్హులైన పేదలకు వెంటనే పింఛన్లు మంజూరు చేయాలని కోరారు.
కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులతో పాటు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన తులం బంగారాన్ని కూడా లబ్ధిదారులకు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

నూతన పింఛన్ల మంజూరు పత్రాలు పంపిణీ

- **సామాజిక భద్రతే ముఖ్య ఉద్దేశం**
- **మంత్రి దామోదర్ రాజనర్సింహ**



చౌట్కూర్, నవంబర్ 16 (జనంసాక్షి):
మండల పరిధిలోని అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం చేయూత పథకం కింద కొత్త పింఛన్లు మంజూరు చేయగా మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధి లో మొత్తం 342 మందికి పింఛన్లు అర్హులైన వారికి. సోమవారం ఏర్పాటు చేసిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా సగ్గుపేట అందోల్ నియోజకవర్గం లక్ష్మీనరసింహ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మంత్రి దామోదర్ రాజా నరసింహ చేతుల మీదుగా అర్హులైన అందోల్ నియోజకవర్గం చౌట్కూర్ మండలంలోని మొత్తం 15 గ్రామ పంచాయతీల్లో అర్హులైన లబ్ధిదారులకు మంజూరైన నూతన పింఛన్ లబ్ధిదారులకు మంజూరు ప్రొసీడింగ్స్‌ను పంపిణీ చేశారు. దీంతో అర్హులైన లబ్ధిదారులలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.
మంజూరైన పింఛన్లలో అత్యధికంగా 253 వితంతు పింఛన్లు, 48 వికలాంగుల పింఛన్లు, చేనేత, గీత కార్మికులకు సంబంధించి 41 పింఛన్లు ఉన్నాయి. మండల కేంద్రం చౌటకూర్‌లో 63 మంది, కొర్పోల్‌లో 51 మంది, శివంపేటలో 50 వికలాంగులకు 48, ఒంటరి మహిళలకు 23 పింఛన్లు చక్రియాల్‌లో 32, బొమ్మారెడ్డి గూడెంలో 20, వెండికోల్‌లో 20, బద్రిగూడెంలో 16, గంగోజిపేటలో 16, వెంకటకిష్టాపూర్‌లో 15, సుల్తాన్ పూర్, తాడ్దానిపల్లి, ఉప్పరిగూడెం గ్రామాల్లో 12 చొప్పున, సరాఫ్ పల్లిలో 11, లింగంపల్లిలో 8, పోసానిపల్లిలో 4 పింఛన్లు మంజూరైన పత్రాలను మంత్రి చేతుల మీదుగా డిలీట్ చేసిన అనంతరం మంత్రి మాట్లాడుతూ సమాజంలోని ప్రతి పేదవాడికి విద్య, వైద్యం, సామాజిక భద్రత కల్పించి, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం చేయూత పింఛన్లు మంజూరు చేస్తోందని తెలిపారు.



కార్యక్రమంలో చౌటకూర్ మండల తహసీల్దారు విజయ లక్ష్మి, ఎంపీడీవో కె. శంకర్, సంగారెడ్డి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు నందికంటి రామచంద్ర రెడ్డి సర్పంచులు మల్లారెడ్డి, గొల్ల మల్లేశం, పార్ముల రాంరెడ్డి, గ్రామ సర్పంచులు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, నూతన పింఛన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక దాడి.. ప్రధాన నిందితుడికి 20 ఏళ్ల జైలు!

- సహకరించిన మరో ఇద్దరికి ఏడేళ్ల చొప్పున కారాగార శిక్ష
- ముగ్గురికీ రూ.20 వేల చొప్పున జరిమానా
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

మెదక్ బ్యూరో, నవంబర్ 16 (జనంసాక్షి): ప్రేమ పేరుతో మైనర్ బాలికను మాయమాటలతో నమ్మించి ఇంటి నుంచి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన ప్రధాన నిందితుడికి మెదక్ జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. నేరానికి సహకరించిన మరో ఇద్దరికి ఏడేళ్ల చొప్పున జైలు శిక్ష విధించింది. ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి రూ.20 వేల జరిమానా కూడా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.



అల్లాదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన తొమ్మిదో తరగతి బాలికకు గతేడాది సంక్రాంతి సెలవుల్లో సాయిలు (34) అనే వ్యక్తి ప్రేమ పేరుతో దగ్గరయ్యాడు. ఆమెను నమ్మించి మెదల్ పసుపుతాడు కట్టి, సెల్‌ఫోన్ కొనిచ్చాడు. అనంతరం పోచమ్మ, నర్సింలు అనే మరో ఇద్దరు నిందితులు సాయిలు బాగా చూసుకుంటాడని బాలికను నమ్మించారు. దీంతో సాయిలు రాత్రి సమయంలో బాలికను బైక్‌పై తీసుకెళ్లి లింగంపల్లి నుంచి సికింద్రాబాద్ చేరుకుని రైలులో విశాఖపట్నం తీసుకెళ్లాడు. అక్కడ గది అద్దెకు తీసుకుని బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు తీసుకెళ్లి చివరకు స్వగ్రామంలో వదిలిపెట్టి పరారయ్యాడు. ఇంటికి చేరుకున్న బాలిక జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపింది.

కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో 2025 మార్చి 2న అల్లాదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సీఐ రేణుకారెడ్డి దర్యాప్తు చేసి ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య బలమైన వాదనలు వినిపించడంతో నేరం రుజువైంది. నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడేవారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు.

పత్రికా రంగం ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభం: గోవర్ధన్ రెడ్డి



గుమ్మడిదల, నవంబర్ 16 (జనంసాక్షి): జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పాత్రికేయులందరికీ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికా రంగం నాలుగో స్తంభంగా కీలక పాత్ర పోషిస్తోందన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలను నిర్భయంగా ప్రశ్నిస్తూ సామాన్యుల గొంతుకగా నిలుస్తున్న పాత్రికేయుల సేవలు అభినందనీయమన్నారు. ఎన్నో సవాళ్లు, ఒత్తిళ్ల మధ్య సమాజ శ్రేయస్సుకు కృషి చేస్తున్న జర్నలిస్టుల సేవలు వెలకట్ట లేనివని కొనియాడారు. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు పత్రికా రంగం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం

అర్హులైన 484 మందికి చేయూత పింఛన్ల మంజూరు పత్రాల అందజేత: ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

బెజ్జంకి, నవంబర్ 16(జనంసాక్షి): మండల కేంద్రంలోని మణికంఠ కాటన్ మిల్లులో సోమవారం సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం కస్తూర్బా గాంధీ పాఠశాలలో పూర్తయిన నూతన తరగతి గదులను ప్రారంభించారు. పీఏసీఎస్ ఫంక్షన్ హాల్‌లో అర్హులైన 484 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్ల మంజూరు పత్రాలను అందజేశారు.





ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయకుండా ప్రజలను నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం పంపిణీతో పాటు నూతన పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. పేదలకు భూములు పంచిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బస్వరాజు సారయ్య,పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్,ఏఎంసీ చైర్మన్ మాతంగి శిరీష అనిల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ పర్ష సంతోష్,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్, వివిధ గ్రామాల సర్పంచులు, డైరెక్టర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



మెలిగిరిపేటలో చేయూత పింఛన్లు, కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



సదాశివపేట, నవంబర్ 16 (జనంసాక్షి): మండలంలోని మెలిగిరిపేట గ్రామంలో లబ్ధిదారులకు చేయూత పింఛన్లు, కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. దొబ్బల బలరాం, టేకురి రమేష్‌లకు పింఛన్లు, పట్లోళ్ల సువర్ణకు కళ్యాణలక్ష్మి చెక్కును ఎమ్మార్వో హరిచంద్ర ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ షాబుద్దీన్ మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ పి.యాదయ్య, గ్రామ కార్యదర్శి రాములు పాల్గొన్నారు.

ఎర్రవల్లి పాదయాత్రకు బీఆర్ఎస్ నేతల ఘన స్వాగతం



మెదక్, నవంబర్ 16 (జనంసాక్షి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ ఏడుపాయల నుంచి ఎర్రవల్లికి పాదయాత్ర చేపట్టిన నాయకులకు మెదక్ పట్టణంలో ఘన స్వాగతం లభించింది. పట్టణంలోని వెల్కమ్ బోర్డు వద్ద మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాదయాత్ర బృందాన్ని ఆత్మీయంగా ఆహ్వానించారు. కేసీఆర్ పాలనలో రైతుబంధు, రైతుబీమా, మిషన్ భగీరథ, ఉచిత విద్యుత్ వంటి పథకాలతో ప్రజలకు మేలు జరిగిందని నాయకులు పేర్కొన్నారు. ఏడుపాయల వనదుర్గమ్మ ప్రసాదాన్ని కేసీఆర్‌కు అందజేసేందుకు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బట్టి ఉదయ్, దీపక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో బాలానగర్ విద్యార్థుల పతకాల జైత్రయాత్ర





బాలానగర్, నవంబర్ 16 (జనంసాక్షి): జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బాలానగర్ ప్రేమ్ నారాయణ ఈఎం హైస్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఆదివారం ఆర్కే గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన 28వ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొని 13 బంగారు, 7 వెండి పతకాలు సాధించారు. పాల్గొన్న ప్రతి విద్యార్థి పతకం గెలుచుకోవడం విశేషం. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ సతీష్ కుమార్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, జేకే మాస్టర్ షోటోకాన్ డో ఇండియా క్లబ్ వ్యవస్థాపకుడు జి. కృష్ణయ్య, సీనియర్ మాస్టర్ ఏ. కృష్ణయ్య అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా మాస్టర్ సతీష్ కుమార్‌ను ప్రశంసించారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపునకు ప్రత్యేక చర్యలు



- ఎస్ఎల్ఓ ట్రాకర్‌తో ప్రతి విద్యార్థి ప్రగతి పర్యవేక్షణ
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల నడిగడ్డ, నవంబర్ 16 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచి, పునాది అక్షరాస్యత, సంఖ్యా జ్ఞానాన్ని బలోపేతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కాంపిటెంట్ పాఠశాలల విద్యార్థుల ప్రగతి నమోదు కోసం రూపొందించిన బుక్‌లెట్లను విద్యాశాఖ అధికారులతో కలిసి విడుదల చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 87 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 'హెల్పింగ్ హాండ్స్' పేరుతో ప్రత్యేక విద్యా బోధకులను నియమించినట్లు తెలిపారు. విద్యార్థులు పాఠ్యాంశాలను చదవడంతో పాటు వాటిని అర్థం చేసుకుని స్వయంగా చదవడం, రాయడం, గణిత సమస్యలను పరిష్కరించే నైపుణ్యాలు సాధించేలా బోధన అందించాలన్నారు.

ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించేందుకు స్టూడెంట్ లెర్నింగ్ అవుట్‌కమ్ (ఎస్ఎల్ఓ) ట్రాకర్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. తెలుగు, ఇంగ్లీష్, గణితంలో విద్యార్థులు సాధించిన నైపుణ్యాలు, వెనుకబడిన అంశాలను ట్రాకర్‌లో నమోదు చేయాలన్నారు. విద్యార్థులందరినీ ఒకే స్థాయిలో అంచనా వేయకుండా వ్యక్తిగత సామర్థ్యాలను బట్టి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. చదవడం, రాయడం, అక్షరాలు, పదాలు గుర్తించడం, సంఖ్యలను అర్థం చేసుకోవడం, కూడికలు, తీసివేతల్లో వెనుకబడిన వారికి అదనపు బోధన అందించాలన్నారు. ప్రతి వారం అభ్యసన పురోగతిని సమీక్షిస్తూ, అవసరమైన విద్యార్థులకు రెమెడియల్ బోధన కల్పించాలని సూచించారు. గణిత బోధనలో వస్తువులు, చిత్రాలు, సంఖ్యల ఆధారంగా కాంక్రీట్, పిక్టోరియల్, అబ్ట్రాక్ట్ విధానాలను అనుసరించాలని తెలిపారు. పఠన సామర్థ్యం పెంపునకు ప్రతిరోజూ చదివే అలవాటును ప్రోత్సహించాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేస్తూ ఎఫ్ఎల్ఎన్ లక్ష్యాలను సాధించాలని, ప్రతి విద్యార్థి కనీస అభ్యసన సామర్థ్యాలు పొందేలా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈఓ విజయలక్ష్మి, ఏఎంఓ వినోద్ కుమార్, ఎఫ్ఎల్ఎన్ సెల్ బృందం సభ్యులు మురళీధర్ రెడ్డి, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



కొల్చారం, నవంబర్ 16(జనంసాక్షి): కొల్చారం మండలంలోని తుక్కాపూర్ గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు వితంతు, దివ్యాంగుల నూతన పింఛన్ మంజూరు పత్రాలను నర్సాపూర్ ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న సామాజిక భద్రతా పింఛన్లు వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా ప్రజాప్రతినిధులు, నాయకులు కృషి చేయాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు, ఉప సర్పంచ్ ఆరె రవీందర్, గ్రామ కార్యదర్శి ప్రశాంత్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రజక సంఘం జిల్లా సమావేశాన్ని విజయవంతం చేయాలి



వనపర్తి, నవంబర్ 16 (జనంసాక్షి): ఈ నెల 29న నిర్వహించనున్న రజక సంఘం జిల్లా స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా మాజీ అధ్యక్షుడు దాశరాజు శ్రీనివాసులు, మాజీ కార్యదర్శి సాలేష్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా పరిధిలోని అన్ని మండలాల రజక సంఘం నాయకులు, అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, కార్యదర్శులు, కుల పెద్దలు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

ఈ నెల 29న జరిగే సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సంఘంలో పనిచేయాలనే ఆసక్తి, ఉత్సాహం ఉన్నవారు ముందుకు వచ్చి రజక కుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సంఘం మాజీ అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు, కుల పెద్దలు, రిటైర్డ్, ప్రస్తుత ఉద్యోగులు సమావేశానికి హాజరై తమ సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రెవల్లి మండల అధ్యక్షుడు సిట్టిరాజుల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎకలవ్య పాఠశాలలో ఉపాధ్యాయుల గైర్హాజరుపై అదనపు కలెక్టర్ ఆగ్రహం!

అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేయాలని ఆదేశం!

బాలానగర్, నవంబర్ 16 (జనంసాక్షి): బాలానగర్‌లోని ఎకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను అదనపు కలెక్టర్ (ఎల్‌బీ) మధుసూదన్ నాయక్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయుల విధుల నిర్వహణ తీరును పరిశీలించారు. తనిఖీలో భాగంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన అదనపు కలెక్టర్ వారి చదువులు, విద్యా ప్రగతి, బోధన పద్ధతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందుతున్న విద్యా ప్రమాణాలను తెలుసుకుంటూ పలు సూచనలు చేశారు.



అయితే తనిఖీ సమయంలో పలువురు ఉపాధ్యాయులు ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైనట్లు గుర్తించారు. దీనిపై అదనపు కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేసి, వారి నుంచి వివరణలు తీసుకోవాలని సంబంధిత ఆర్‌సీఓను ఆదేశించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, వారికి నాణ్యమైన విద్య అందించడం ప్రతి ఉపాధ్యాయుడి బాధ్యత అని పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా సమయపాలన పాటించాలని, విద్యార్థుల విద్యా ప్రగతికి ప్రాధాన్యతనిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు.

అర్హులైన పేదలకు చేయూత.. 364 మందికి పింఛన్ల మంజూరు!

- **మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు కొత్త పింఛన్ల కేటాయింపు**
- **వితంతువులకు 239.. దివ్యాంగులకు 69 పింఛన్లు**
- **పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారుల్లో హర్షాతిరేకాలు**

చిలప్‌చేడ్, నవంబర్ 16 (జనంసాక్షి): అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చిలప్ చేడ్ మండలానికి 364 చేయూత పింఛన్లు మంజూరు చేసింది. మండలంలోని 19 గ్రామ పంచాయతీల పరిధిలో వివిధ వర్గాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు ఈ పింఛన్లు కేటాయించింది. మంజూరైన పింఛన్లలో వితంతువులకు అత్యధికంగా 239, దివ్యాంగులకు 69 పింఛన్లు కేటాయించారు. అదేవిధంగా ఒంటరి మహిళలకు 35, కల్లుగీత కార్మికులకు 21 పింఛన్లు మంజూరయ్యాయి.

గ్రామాల వారీగా పరిశీలిస్తే చిట్కుల్ గ్రామంలో అత్యధికంగా 43 పింఛన్లు మంజూరు కాగా, చిలప్ చేడ్‌లో 37, ఫైజాబాద్‌లో 35, చండూర్‌లో 34 పింఛన్లు కేటాయించారు. మిగిలిన గ్రామాల్లోనూ అర్హులైన వారికి పింఛన్లు మంజూరయ్యాయి. మొత్తంగా మండలానికి 364 చేయూత పింఛన్లు మంజూరు కావడంతో ఆయా వర్గాలకు చెందిన లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలు, వితంతువులు, దివ్యాంగులకు ఈ పింఛన్లు కొంతమేర ఆర్థిక భరోసా కల్పించనున్నాయి.



ఆసుపత్రి స్థలంలో ఇతర భవనాల నిర్మాణాలకు అనుమతులివ్వొద్దు

ఖిల్లా ఘనపురం, నవంబర్ 16 (జనంసాక్షి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఇతర శాఖల భవనాల నిర్మాణాలకు అనుమతులు ఇవ్వొద్దని బీజేపీ నాయకులు కోరారు. సోమవారం మండల అధ్యక్షుడు బుచ్చిబాబు గౌడ్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. ఆసుపత్రి ఖాళీ స్థలంలో అంగన్‌వాడీ కేంద్రం సహా ఇతర కార్యాలయాల నిర్మాణ ప్రయత్నాలను నిలిపివేయాలని కోరారు. భవిష్యత్తులో ఆసుపత్రి విస్తరణకు ఆ స్థలం అవసరమవుతుందని తెలిపారు. ఆసుపత్రి చుట్టూ ప్రహరీ నిర్మించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దశరథం, కొరిగెల గోపి ముదిరాజ్, బెన్నూరు ఆశన్న, చిట్యాల రామచంద్రయ్య, మ్యాథరి శివశంకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



19న ఛలో సిద్దిపేటకు కాంగ్రెస్ పార్టీ అభిమానులు భారీగా తరలిరావాలి

- **పార్టీ మండల అధ్యక్షులు శెట్టి సుధాకర్**

కోహెడ నవంబర్ 16 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈ నెల 19వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి బారి బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ మండల శెట్టి సుధాకర్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ నాయకులు రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సారథ్యంలో కోహెడ మండలం నుండి కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బారి సంఖ్యలో పార్టీ అభిమానులు, కార్యకర్తలు, తరలిరావాలని సోమవారం మండలంలోని సముద్రాల, మైసం పల్లి ,కాచాపూర్, సిసి పల్లె గ్రామలలోని ఆయా గ్రామాల సర్పంచులు అలాగే పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులతో మండలంలోని ఆయా గ్రామాల ఇంచార్జీ లు బీమ్ రెడ్డి తిరుపతి రెడ్డి, దూలం శ్రీనివాస్ గౌడ్ అలాగే ఆవుల మహేందర్ లతో కలిసి సమావేశం నిర్వహించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగే బహిరంగ సభలో ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి పేదవారికి ఇందిరమ్మ బీమాను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్రం లో ఎన్నడు లేని విధంగా చరిత్రలో నిలిచిపోయే విధంగా సుమారు నాలుగు లక్షల అరవై మూడు వేల మందికి నూతన పించన్లు పంపిణీ చేస్తున్నారని, రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సారథ్యంలో మన కోహెడ మండలానికి దాదాపుగా ఏడు వందల మంది లబ్ధిదారులకు నూతన పించన్లు మంజూరు అయినట్లు తెలిపారు. మండలం లోని వివిధ గ్రామాల నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలి వెళ్ళి ప్రజా పాలన నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బారి బహిరంగ సభను విజయవంతం చేయాలి అని ఆయన పిలుపునిచ్చారు. అలాగే హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉన్న వృద్ధులకు, దివ్యాంగులకు అందరికి చేయూతను ఇవ్వాలనే ఏకైక లక్ష్యంతో ముందుకు సాగుతున్న మన అభివృద్ధి ప్రదాత రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మన కోహెడ మండలంలో కూడా అన్ని గ్రామాలలో ఉన్న వికలాంగులకు, వృద్ధులకు కూడా అలింకో సహకారంతో ఉచితంగా పరికరాలను పంపిణీ చేస్తున్నందున ఈ నెల 20 వ తేదీన మండల కేంద్రంలోని లక్ష్మి గార్డెన్ లో ఉచిత పరికరాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా వారి యొక్క పేర్లను నమోదు చేయించి,వారికి ఉచిత పరికరాలు వచ్చే విధంగా ఆయా గ్రామాల సర్పంచ్ లు, గ్రామ శాఖ అధ్యక్షులు, సినియర్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు అందరూ సమిష్టిగా పనిచేసి విజయవంతం అయ్యేవిధంగా పని చేయాలని సుధాకర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు,సర్పంచ్ లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అలాగే యువజన కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పిల్లల ప్రజావాణిలో చిన్నారుల సమస్యలు

- **పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తాం: కలెక్టర్**
- **ప్రజావాణికి 40 ఫిర్యాదులు.. 73 ఆర్జీలు పెండింగ్**
- **19న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా ప్రారంభం**



జోగులాంబ గద్వాల, నవంబర్ 16 (జనంసాక్షి): బాలల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు పిల్లల ప్రజావాణి దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బాలల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో సాధారణ ప్రజావాణితో పాటు ప్రత్యేక పిల్లల ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తమ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, క్రీడా మైదానాలు, మరుగుదొడ్లు, ఉపాధ్యాయుల కొరత వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. వాటిని సంబంధిత అధికారుల ద్వారా పరిష్కరిస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు.


అనంతరం సాధారణ ప్రజావాణిలో ఈ వారం వివిధ శాఖలకు సంబంధించి 40 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. గతంలో వచ్చిన 73 ఆర్జీలు ఇంకా పెండింగ్‌లో ఉండటంపై అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ నెల 19న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని ప్రారంభించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీతో పాటు, కొత్తగా చేయూత పింఛన్లకు అర్హులైన వారికి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా మంజూరు పత్రాలు అందజేయాలని ఆదేశించారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మర్రికుంట కట్టపై చెట్ల నరికివేత.. గ్రామస్తుల ఆగ్రహం

- **చెట్లను నరికిన వారెవరు? అధికారుల నిర్లక్ష్యమా?**







కొల్చారం, నవంబర్ 16(జనంసాక్షి): కొల్చారం మండలంలోని చిన్నగనాపూర్ శివారులో ఉన్న మర్రికుంట కట్టపై వేప చెట్ల నరికివేత వివాదాస్పదంగా మారింది. మెదక్ –సంగారెడ్డి ప్రధాన రహదారి పక్కన వేప చెట్లను నరికి వేయడం పై గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాలె వెంకటేశం పొలం ప్రక్కన ఉన్న కుంటకట్టపై చెట్ల నరికివేత జరిగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వ భూములకు, గుంటకట్టలకు ఆనుకొని ఉన్న చెట్లను యదేచ్ఛగా నరికి వేస్తున్న సంబంధిత అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ చెట్లను భూమి యజమాని నరికించారా? లేక మరెవరైనా నరికివేశారా? అనే విషయాలు ఇంకా తెలియాల్సి ఉంది. చెట్లను నరికిన అనంతరం వాటి దుంగలను, కొమ్మల కింద కప్పి ఉంచినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. ఈ వ్యవహారం అటవీ అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

చెట్ల నరికివేతపై సమగ్ర విచారణ చేపట్టాలి...

అధికారులు వెంటనే స్పందించి నరికివేసిన వేప చెట్ల దుంగలను స్వాధీనం చేసుకోవాలని, కుంట కట్టపై చెట్ల నరికివేతకు బాధ్యులెవరో సమగ్ర దర్యాప్తు ద్వారా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే ప్రభుత్వ ఆస్తులు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన నిబంధనలు కాగితాలకే పరిమితమవుతాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న లింగ బలిజ సంఘం సభ్యులు



రాయికోడ్, నవంబర్ 16 (జనంసాక్షి): మండలంలోని చేర్ల రాయిపల్లి గ్రామానికి చెందిన పట్లోల్ల నమిత హనుమన్న పాటిల్ దంపతుల కుమార్తె లావణ్య, సచిన్ పాటిల్ వివాహ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు రాయికోడ్ మండల వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం సభ్యులు హాజరై నూతన వధూవరులకు ఆశీర్వాద ఫొటో అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాశీ బసవరాజ్ పాటిల్, సంఘం అధ్యక్షుడు కర్చల్ దాడువై పవన్ కుమార్, ఉపాధ్యక్షుడు కాశీ అనిల్ కుమార్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు న్యాలకంటి గణపతి, కమిటీ సభ్యులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్వకోల్‌లో 62 మందికి నూతన పింఛన్లు మంజూరు



పెద్దకొత్తపల్లి, నవంబర్ 16 (జనంసాక్షి): పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామానికి చెందిన 62 మంది అర్హులకు నూతన పింఛన్లు మంజూరు కావడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఎన్నో రోజులుగా పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వృద్ధులు, నిరుపేదలు, ఇతర అర్హులకు ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేయడంతో వారి కుటుంబాల్లో ఆనందం నెలకొంది. నెలనెలా అందే పింఛను సొమ్ము నిత్యావసరాలు, మందుల ఖర్చులకు ఉపయోగపడుతుందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తోందని గ్రామస్థులు పేర్కొన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవతోనే 62 మందికి పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే ప్రభుత్వ లక్ష్యం పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందన్నారు. పింఛన్ల మంజూరుపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గువ్వల కురుమయ్య, మల్‌రెడ్డి మధు యాదవ్, కాటమోని బిచ్చన్న గౌడ్, చటమోని సాయిరాం యాదవ్, ఎం.డి. వలి, వార్డు సభ్యుడు నల్లవాళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి

- **ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలి**
- **రేవల్లి ఆసుపత్రి ఎదుట ఐదో రోజు కార్మికుల నిరసన**



రేవల్లి, నవంబర్ 16 (జనంసాక్షి): సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని, ఏజెన్సీ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ సోమవారం రేవల్లి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఐదో రోజు నిరసన చేపట్టారు.
ఈ సందర్భంగా కార్మికులు ఇందిరమ్మ, వెంకటమ్మ, ఆశబీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న పారిశుధ్య, సెక్యూరిటీ, పేషెంట్ కేర్, సూపర్వైజర్ సిబ్బందికి ఐదేళ్లుగా కేవలం రూ.10 వేల వేతనమే చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ 60 ప్రకారం ఒకే వేతనం అమలు చేస్తామని చెబుతున్నా, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి వేర్వేరు వేతనాలు ఇస్తున్నారని విమర్శించారు. ఏజెన్సీల ద్వారా కార్మికుల శ్రమ దోపిడీ జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి సవరించిన కనీస వేతనాల జీవోలను ఆసుపత్రి కార్మికులకూ వర్తింపజేయాలని కోరారు. నిరసనలో జహీరా, లత, సాయిలీల, దేవి, రేవతి, లక్ష్మమ్మ, సిద్ధూ, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

అనాథలకు ఉచిత విద్య అందించాలి - పెర్సిస్ క్రిసాలైట్



గద్వాల నడిగడ్డ, నవంబర్ 16 (జనంసాక్షి);
పిల్లల ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం గద్వాల జిల్లా కలెక్టర్ తలపెట్టిన ప్రజావాణి కార్యక్రమంలో పెర్సిస్ క్రిసాలైట్, ఫెబే గ్రేస్, సెలెస్టియల్ హీవెన్ జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా జిల్లా లో ఉన్న అనాథ బాల బాలికలకు ప్రైవేట్ స్కూల్ లో ఉచిత విద్య అందించాలని. అనాథ పిల్లలు ఆదుకోవాలని వారు జిల్లా కలెక్టర్ ను కోరారు. అంతే కాకా స్కూల్ విద్యార్థి ప్రతి ఒక్కరూ ఒక్కో మొక్కను నాటాలని అలా నాటడం వల్ల పర్యావరణ సమతుల్యత ఏర్పడి వర్షాలు బాగా కురిసే అవకాశం ఉందని..
ఈ విషయాల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జిల్లా లోని ప్రతి స్కూల్ పై రెండు విషయాలు తప్పక పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె.పెర్సిస్ క్రిసాలైట్, కె.ఫోబే గ్రేస్, కె.సెలెస్టియల్ హీవెన్ పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో

ఆడుకోవద్దు: అదనపు కలెక్టర్ నగేష్

- **ప్రజావాణిలో తల్లితండ్రుల పిర్యాదు పరిశీలించాలని డిఈఓను ఆదేశించిన అదనపు కలెక్టర్ నగేష్**



మెదక్ కొల్చారం నవంబర్ 16 (జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు, ఉత్తమమైన బోధన ఉంటుందని నమ్మకంతో తమ పిల్లలను పంపిస్తే వర్క్ అడ్జస్ట్మెంట్, డిప్యూటేషన్ పేరుతో ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు మండలాలకు, పంపుతూ విద్యా ర్థుల జీవితాలతో అధికారులు ఆడుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం ప్రజావాణి లొ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్‌కు పిర్యాదు అందజేశారు.దింతో జిల్లా విద్యాధికారి రాజును పునర్ పరిశీలించాలని సూచించారు. సమస్య ఉత్పన్నం కాకుండా చూడాలని డిఈఓను ఆదేశించారు. కొల్చారం మండల కేంద్రంలో కొల్చారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ మేరకు కొల్చారం ప్రజావాణిలో వర్క్ అడ్జస్ట్మెంట్‌పై మెమొరండం సమర్పించారు. వెంటనే వర్క్ అడ్జస్ట్మెంట్ ఉత్తర్వులను నిలిపివేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమం లొ ఎండి. ఖదీర్,బాల్ రాజ్, శ్రీశైలం, సత్యనారాయణ, యాదగిరి,నాగరాజు, ఆంజనేయులు, కృష్ణ,శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛను అందేలా కృషి చేస్తా

- **చేయూత పెన్షన్ ప్రొసీడింగ్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**



జడ్చర్ల, నవంబర్ 16, (జనంసాక్షి);
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి గారు అన్నారు. ఊర్కొండ మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో నూతనంగా చేయూత పెన్షన్లు మంజూరైన 321 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పెన్షన్ ప్రొసీడింగ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. పెన్షన్ పొందిన లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

57 ఏళ్లు నిండిన

వృద్ధులకు రూ.4 వేల పింఛన్ ఇవ్వాలి

- **ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలి..**
- **ఎమ్మెల్యే వంశీకృష్ణకు వ్యవసాయ కార్మిక సంఘం వినతి**



ఉప్పునుంతల (జనం సాక్షి): 57 ఏళ్లు నిండిన అర్హులైన వృద్ధులందరికీ నెలకు రూ.4 వేల ఆసరా పింఛన్ అందించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణకు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు.
ఈ సందర్భంగా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చింతల నాగరాజు మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదలకు పింఛన్ ఎంతో ఆసరాగా ఉంటుందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన 57 ఏళ్ల అర్హత ప్రకారం పింఛన్లు మంజూరు చేయాలని కోరారు. నెలకు రూ.4 వేల పింఛన్ అందించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, అర్హులైన ఒక్కరూ కూడా పింఛన్‌కు దూరం కాకుండా చూడాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



జడ్చర్ల, నవంబర్ 16 (జనంసాక్షి):
రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8,500 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శ్రీనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం జడ్చర్ల నేతాజీ చౌరస్తాలో బీజేవైఎం ఆధ్వర్యంలో భిక్షాటన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థుల హక్కు అని, బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు కుమార్, వెంకటేష్, విశ్వనాథ్, గణపతి గుప్త, బాలరాజు, భరత్, నరేష్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల భవిష్యత్తుకు ఉచిత కోచింగ్ సెంటర్



పెద్దకొత్తపల్లి, నవంబర్ 16 (జనంసాక్షి): గ్రామీణ ప్రాంత పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్‌లో కిడ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కోచింగ్ సెంటర్‌ను సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ బంట్రోత్ శ్రీనివాసులు ప్రారంభించారు. గురుకుల, నవోదయ, సైనిక్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించనున్నారు. ఇందుకోసం కిడ్స్ సంస్థ సొంత నిధులతో ఉపాధ్యాయినిని నియమించింది.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ పేద విద్యార్థుల్లో ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులు, సరైన మార్గదర్శకత్వం లేక అవకాశాలు అందుకోలేకపోతున్నారని అన్నారు. ఈ ఉచిత శిక్షణ కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలు సాధించాలని సూచించారు. కిడ్స్ సంస్థ చేపట్టిన సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని వనితమ్మ, భాగ్యమ్మ, సంస్థ అధ్యక్షుడు రామకృష్ణ, ధర్మారెడ్డి, కొండ శ్రీను, నల్లవెల్లి రాము యాదవ్, వెంకటస్వామి, అమ్మపల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు నాగర్‌కర్నూల్ జిల్లా సిద్ధం

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు విస్తృత ప్రచారం: కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, నవంబర్ 16 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ విజయవంతానికి నాగర్‌కర్నూల్ జిల్లాలో విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపడతామని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు. యువత, విద్యార్థుల్లో క్రీడలపట్ల ఆసక్తిని పెంపొందించి, క్రీడా స్ఫూర్తి ని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

సోమవారం బీఆర్‌కేఆర్ భవన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహించే అవకాశం రావడం గర్వకారణమన్నారు. జాతీయస్థాయి క్రీడా పోటీల ప్రాధాన్యత ను ప్రజలకు వివరించేందుకు అన్ని శాఖల సమన్వయంతో కార్యక్ర మాలు నిర్వహిస్తామని తెలిపారు.

జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. విద్యార్థులకు క్విజ్, పెయింటింగ్ తదితర పోటీలు నిర్వహించి క్రీడల ప్రాముఖ్యతను తెలియజేస్తామని చెప్పారు. అన్ని మండలాలు, గ్రామాల్లో ప్రచారం నిర్వహించి ప్రజలను భాగస్వాములను చేస్తామని వెల్లడించారు.

ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో ఖేలో ఇండియా ప్రచార సామగ్రిని ఏర్పాటు చేస్తామన్నారు. ముద్రణ, ఎలక్ట్రానిక్, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పిస్తామని తెలిపారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ప్రధాన ప్రాంతాల్లో ఖేలో ఇండియా మస్కట్‌తో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు.

అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి క్రీడా పోటీల సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో క్రీడా వాతావరణాన్ని పెంపొందించడంతో పాటు యువతలోని ప్రతిభను వెలికితీసేందుకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్ మంచి వేదికగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి సీతారాం తదితరులు పాల్గొన్నారు.

బాలల సమస్యల పరిష్కారానికి పిల్లల ప్రజావాణి

- **ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి**
- **ఈ వారం మొత్తం 40 ఫిర్యాదులు స్వీకరణ**
- **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల నడిగడ్డ, నవంబర్ 16 (జనంసాక్షి): బాలల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు పిల్లల ప్రజావాణి కార్యక్రమం దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సోమవారం ఐడీఓసీ సమావేశ మందిరంలో సాధారణ ప్రజావాణితో పాటు బాలల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పిల్లల ప్రజావాణి నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదులు, క్రీడా మైదానాలు, మరుగుదొడ్లు, ఉపాధ్యాయుల కొరత తదితర సమస్యలపై ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే జిల్లా ప్రజావాణిలో ఈ వారం వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 40 ఫిర్యాదులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. గతంలో వచ్చిన అర్జీల్లో ఇంకా 73 పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 19న ప్రారంభించనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కొత్తగా చేయూత పింఛన్లకు అర్హులైన వారందరికీ మంజూరు పత్రాలను సంబంధిత ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందించే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి నాయబ్ తహసీల్దార్‌గా లక్ష్మణ్ నాయక్ బాధ్యతల స్వీకరణ



పెద్దకొత్తపల్లి, నవంబర్ 16 (జనంసాక్షి): నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల నాయబ్ తహసీల్దార్‌గా రాత్లావత్ లక్ష్మణ్ నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పెద్దకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన అధికారికంగా విధుల్లో చేరినట్లు మండల తహసీల్దార్ ఎం. శ్రీనివాసులు వెల్లడించారు.

ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన లక్ష్మణ్ నాయక్‌కు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. మండల పరిధిలో రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజలకు అందించే రెవెన్యూ సేవలను మరింత మెరుగుపరిచేందుకు కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంతోనే నిరుపేదలకు సంక్షేమ ఫలాలు

చేయూత పింఛన్లు, డిజిటల్ రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



శ్రీరంగాపూర్, నవంబర్ 16 (జనంసాక్షి):
నిరుపేదలు, అర్హులైన పేద కుటుంబాలకు సంక్షేమ పథకాల ఫలాలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, నాడు ఇందిరాగాంధీ నుంచి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వరకు, నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.సోమవారం శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చేయూత పింఛన్ల ప్రొసీడింగ్స్, డిజిటల్ రేషన్ కార్డులు, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గారితో పాటు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివసేనారెడ్డిపాల్గొన్నారు.ముందుగా ఆయన శ్రీ రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారే తప్ప, అర్హులైన పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు అందించలేదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీల అమలుతో పాటు పేదల సంక్షేమానికి అనేక చర్యలు చేపట్టిందన్నారు శ్రీరంగాపురం మండలానికి చెందిన 419 మంది లబ్ధిదారులకు చేయూత పింఛన్లకు సంబంధించిన ప్రొసీడింగ్స్ అందజేయడం సంతోషంగా ఉందన్నారు. పింఛన్లు, రేషన్ కార్డులు పేద కుటుంబాలకు భరోసాగా నిలుస్తాయని పేర్కొన్నారు.మహిళల సంక్షేమం గురించి మాట్లాడే బీఆర్ఎస్ నాయకులు తమ కుటుంబంలోనే మహిళలకు న్యాయం చేయలేకపోయారని విమర్శిస్తూ, రాష్ట్రంలోని మహిళలకు వారు ఏ విధంగా న్యాయం చేస్తారని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళల సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఎన్నికల హామీల్లో భాగంగా తులం బంగారం అందించే పథకాన్ని కూడా రానున్న రోజుల్లో అమలు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని, ప్రజా ప్రభుత్వం పేదల పక్షాన నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మద్దిలేటి, మండల అధ్యక్షులు విష్ణు, శ్రీహరి రాజు, ఎంపీడీవో చెన్నయ్య,ఎమ్మార్వో వరలక్ష్మి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు మహదేవ్ సాగర్, అన్ని గ్రామాల సర్పంచులు మరియు కాంగ్రెస్ నాయకులు పి అశోక్ కుమార్ రెడ్డి వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఐజేయు ఎన్నికల్లో నారాయణపేట జర్నలిస్టుల విజయబావుటా

- **జాతీయ స్థాయిలో ముగ్గురికి, రాష్ట్ర కౌన్సిల్‌లో నలుగురికి స్థానం**



నారాయణపేట, నవంబర్ 16 (జనంసాక్షి): ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయు) ఎన్నికల్లో నారాయణపేట జిల్లాకు చెందిన ఏడుగురు జర్నలిస్టులు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో ప్రతినిధులుగా ఎన్నికయ్యారు. జాతీయ సభ్యులుగా వారధి నవీన్ కుమార్, అవుటి రాజశేఖర్, కోస్గి మోహన్ ఎన్నిక కాగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా శ్రీధర్ సర్గం, మహమ్మద్ జహీర్ సోఫీ, ఉట్కూర్ ఎల్లారెడ్డి, మక్తల్ విజయ్ కుమార్ గౌడ్ ఎన్నికయ్యారు. ఒకే జిల్లాకు చెందిన ఏడుగురికి కీలక పదవుల్లో ప్రాతినిధ్యం దక్కడంతో జిల్లా జర్నలిస్టుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. జర్నలిస్టుల హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన స్వేచ్ఛ, ఉద్యోగ భద్రత, అక్రిడిటేషన్లు, ఆరోగ్య భద్రత వంటి సమస్యలను జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రస్తావించేందుకు ఈ ప్రాతినిధ్యం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికైన ప్రతినిధులకు జిల్లా జర్నలిస్టులు అభినందనలు తెలిపారు. సహకరించిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు అల్లం నారాయణ, ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్‌తో పాటు జిల్లా జర్నలిస్టులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

తిమ్మప్ప స్వామి ఆలయ టెంకాయల వేలం ఖరారు

మద్దికల్, నవంబర్ 16 (జనంసాక్షి): మద్దికల్ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ టెంకాయల వేలం రూ.25,05,999కు పూజారి మద్దికల్ దక్కించుకున్నారు. తలనీలాల వేలం రూ.3,27,777కు దాసరి రామకృష్ణ దక్కించుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఆదాయం పెరిగిందని చైర్మన్ ప్రహ్లాదరావు, ఈవో సత్య చంద్రారెడ్డి తెలిపారు.

ప్రతి ఇంటికి వస్తా.. ప్రజల కష్టాలు తీరుస్తా!

- 'మన ఎమ్మెల్యే మన ఇంటికి' కార్యక్రమంతో ప్రజల వద్దకు వస్తా
- మిడ్జిల్ మండల అభివృద్ధే నా ధ్యేయం.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందేలా చూస్తా: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి





మిడ్జిల్, నవంబర్ 16 (జనంసాక్షి): ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే తన లక్ష్యమని, 'మన ఎమ్మెల్యే మన ఇంటికి' కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ వచ్చి ప్రజల కష్టసుఖాలను తెలుసుకుంటానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఆదివారం అర్హులందరికీ 437 చేయుత పింఛన్ పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో నిర్వహించిన చేయూత పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలోనే ప్రజల వద్దకు వచ్చే నాయకులు, ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రజలను పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకులను విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎక్కడా కమిషన్లు తీసుకోలేదని, దేవుడి సాక్షిగా ఈ మాట చెబుతున్నానని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కూడా ఇదే విధంగా చెప్పగలరా అని ప్రశ్నించారు. గత పాలకుల హయాంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు జరిగాయని ఆరోపించిన ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల సొమ్మును దోచుకునే విధంగా వ్యవహరించరని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో నియోజకవర్గానికి ట్రిపుల్ ఐటీ, నవోదయ విద్యాసంస్థలను మంజూరు చేయించానని తెలిపారు. రాబోయే రోజుల్లో మిడ్జిల్ మండల కేంద్రంలో నవోదయ పాఠశాల మంజూరయ్యేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. మిడ్జిల్, ఊర్కొండ మండలాల్లోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించారని తెలియజేశారు.

కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యే ఎమ్మెల్యేగా గెలిచిన మూడు సంపత్సరాలలో నియోజకవర్గంలోని 300 కోట్ల నిధులు. రోడ్ల నిర్మాణానికి మంజూరు చేయించానాని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి విష్ణునంద. తాసిల్దార్ రాఘవేందర్ రెడ్డి. ఎంపీడీవో లక్ష్మణ్ రాథోడ్. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జ్యోతి అల్వాల్ రెడ్డి. సీనియర్ నాయకులు గౌస్ రబ్బాని. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గౌస్. ఉపాధ్యక్షుడు రాజు. వెంకట శివ ప్రసాద్. గ్రామ సర్పంచి. సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు శంకర్. వివిధ గ్రామాల సర్పంచులు గోద శ్రీశైలం. గోపాల్. రాములు. రాజు. ధర్మ. సువర్ణ. ఆయా గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

అర్హులైన పేదలందరికీ చేయూత పింఛన్లు

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



జడ్చర్ల, నవంబర్ 16 (జనంసాక్షి): అర్హులైన పేదలందరికీ చేయూత పింఛన్లు అందించి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. చంద్రగార్డెన్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి 1,279 మంది లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ ప్రొసీడింగ్స్‌ను అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో 491, మండల పరిధిలో 788 మందికి ఈ పింఛన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్ నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. అర్హత ఉండి పింఛన్ రానివారు మున్సిపల్ కార్యాలయాన్ని సంప్రదిస్తే మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. పింఛన్లు బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తాయని మున్సిపల్ కమిషనర్ గిరీష్ పేర్కొన్నారు. దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులకు పింఛన్లు అందడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, మున్సిపల్ సిబ్బంది, వార్డు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



గుడెబాల్లూర్‌కు
103 మందికి చేయూత అసరా పెన్షన్ మంజూరు



కృష్ణ, నవంబర్ 16 (జనంసాక్షి): కృష్ణ మండల గుడెబల్లూరు గ్రామానికి నూతన 103 మందికి చేయూత పెన్షన్ లు మంజూరు అయ్యాయి. వాటి ప్రిసైడింగ్ ధ్రువీకరణ పత్రాలను మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో సోమవారం, పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు జి.శాంతమ్మ తనయుడు గజ్జి అంజినేయులు, వాకిటి నారాయణ, ఈడిగి విజయ గౌడ, కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చెరువు కట్ట రాము, పంచాయతీ కార్యదర్శి రఘు స్వామి, చెవిటోళ్ల తిమ్మరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న ప్రజా ప్రభుత్వం

- 455 మందికి నూతన చేయూత పింఛన్లు..
- 33 మందికి,కళ్యాణలక్ష్మి,షాదీముబారక్ చెక్కుల పంపిణీ..
- చౌదర్‌పల్లిలో 20లక్షలతో అంగన్‌వాడీ,మహిళా సమాఖ్య భవనం ప్రారంభం..





మహమ్మదాబాద్, నవంబర్ 16 (జనంసాక్షి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం మహమ్మదాబాద్ మండలంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించి, సంక్షేమ పథకాల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు, చెక్కులు పంపిణీ చేశారు.

చౌదర్‌పల్లిలో రూ. 10 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనం, మరో రూ. 10 లక్షలతో నిర్మించిన మహిళా సమాఖ్య భవనం, రూ. 7 లక్షలతో నిర్మించిన ప్రహరీ గోడను ప్రారంభించారు. కుచ్చమీది తండాలో రూ. 4 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అనంతరం నంచర్ల పల్లవి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో 455 మందికి నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ నెల 19న వారి ఖాతాల్లో పింఛన్ నగదు జమ కానుందని తెలిపారు. 33 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. మహమ్మదాబాద్ జూనియర్ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. విద్యార్థులు కంప్యూటర్ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. అర్హులైన పేద లందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కేసీఆర్ మళ్లీ రావాలి.. నువ్వే కావాలి

- 16 నియోజకవర్గాల్లో 600 కిలోమీటర్ల బైక్ యాత్ర.. 60 దేవాలయాల్లో ప్రత్యేక పూజలు
- పాలమూరు యూనివర్సిటీలో ఉద్యమకారుడు రామలింగానికి బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకుల ఘన స్వాగతం



మహబూబ్‌నగర్ ప్రతినిధి, నవంబర్ 16 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు రామలింగం బైక్ యాత్ర చేపట్టారు. 16 నియోజకవర్గాల్లో 600 కిలోమీటర్ల మేర సాగనున్న ఈ యాత్రలో 60 దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పాలమూరు యూనివర్సిటీకి చేరుకున్న రామలింగానికి బీఆర్ఎస్వీ విద్యార్థి నాయకులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా రామలింగం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కృషి, పట్టుదల, నిబద్ధత మరువలేనివని అన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో విద్య, వైద్యం, సాగునీరు, తాగునీరు, విద్యుత్, ఉపాధి వంటి రంగాల్లో తెలంగాణను అభివృద్ధి పథంలో నిలిపారని పేర్కొన్నారు. రైతుబంధు, రైతు సంక్షేమ పథకాలతో రైతుల కుటుంబాల్లో ఆనందం నింపారని అన్నారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు కరువు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. ఎలినో ప్రభావంతో కరువు వచ్చిందని చెబుతున్న ముఖ్యమంత్రి రైతులకు సాగునీరు, విద్యుత్, రైతు భరోసా ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు ప్రచారాలు మానుకుని ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రైతులు బాగుండాలని, సాగునీరు, విద్యుత్ అందాలంటే కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థి నాయకులు పవన్, వెంకటేష్, మహేష్, అంజి తదితరులు పాల్గొన్నారు.

పేటలో ఘనంగా
సహస్త్రార్జున జయంతి వేడుకలు



నారాయణపేట నవంబర్ 16(జనంసాక్షి): సహస్త్రార్జున్ జయంతి వేడుకలను నారాయణపేట పట్టణంలో సోమవారం ఎస్ ఎస్ కే సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా సమాజ్ మహిళలు,యువకులు,పెద్దలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సహస్త్రార్జున్ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎస్ ఎస్ కే సమాజ్ జాతీయ ఉపాధ్యక్షుడు నాగురావు నామాజీ మార్గదర్శనం చేస్తూ సహస్తరార్జున్ స్ఫూర్తితో సమాజంలోని ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని సమాజ సేవకు అంకితం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాజ్ పెద్దలు,మహిళలు,యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎస్సీ సెల్
జిల్లా కార్యదర్శిగా ధోని ఆంజనేయులు



మల్దకల్, నవంబర్ 16 (జనంసాక్షి): జోగులాంబ గద్వాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శిగా మల్దకల్ మండలం అమరవాయి గ్రామానికి చెందిన ధోని ఆంజనేయులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఆయనను సన్మానించారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర మేకలు, గొర్రెల సహకార కార్పొరేషన్ చైర్‌పర్సన్ సరితకు ఆంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి, ఎస్సీ వర్గాల సంక్షేమానికి కృషి చేయాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు తిరుమల్, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ రాజేందర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి

• జిల్లా కలెక్టర్ ప్రియాంక



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 16(జనంసాక్షి): జిల్లాలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు.

సోమవారం ప్రజావాణి హాల్‌లో వివిధ శాఖలజిల్లా, మండల స్థాయి అధికారుల తో నిర్వహించిన సమావే శంలో ఆమె పలు అంశాల పై సమీక్షించి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన గ్రామాలను తప్పనిసరిగా సందర్శించి, ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించేలా చిన్న సమావేశాలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ నెల 27వ తేదీన అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని, ప్రతి ప్రత్యేక అధికారి తప్పనిసరిగా పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. అలాగే ఈ నెల 17 నుంచి 26వ తేదీ వరకు దేవాలయాలు, మసీదులు, పాఠశాలలు, కళాశాలలు, మహిళా సంఘాలు, వివిధ కార్యాలయాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు చురుకుగా పాల్గొని కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, నిర్వహించిన కార్యక్రమాలకు సంబంధించిన వివరాలతో ప్రెస్ నోట్లు విడుదల చేయాలని సూచించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం...

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై కలెక్టర్ ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ నెల 19వ తేదీ నుంచి పథకం రిజిస్ట్రేషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పథకం కింద ప్రతి కుటుంబం నుంచి 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ఒక వ్యక్తిని బీమా పొందే వ్యక్తిగా ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఎంపిక చేసిన వ్యక్తికి రూ. 5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు వివరించారు. కుటుంబ సభ్యులు తమకు నచ్చిన నామినీని ఎంపిక చేసుకోవచ్చని, నామినీకి అందాల్సిన వాటాలను కూడా నిర్ణయించుకోవచ్చని తెలిపారు.ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపల్ వార్డులో దరఖాస్తుల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని, దరఖాస్తులను డిజిటల్ విధానంలో నమోదు చేయడంతో పాటు, ఒరిజినల్ దరఖాస్తులను భద్రపరచాలని సూచించారు. బీమా సంస్థలకు దరఖాస్తులు పంపే సమయంలో సంతకాలు, నామినీ వివరాలు తదితర అంశాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.రేషన్ కార్డు ఉన్నవారి వివరాలను ప్రాథమికంగా వినియోగించుకోవచ్చని, రేషన్ కార్డు లేని కుటుంబాలకు ఆధార్ ధ్రువీకరణ, కేవైసీ లేదా బయోమెట్రిక్ విధానం ద్వారా వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఎలాంటి డూప్లికేషన్‌కు అవకాశం లేకుండా పకడ్బందీగా డేటా నమోదు చేయాలని సూచించారు. ఈ ప్రక్రియకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని మీ సేవా శాఖ అందిస్తుందని పేర్కొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు మండల స్థాయి ప్రత్యేక అధికారులు సమన్వయకర్తలుగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాలు, మున్సిపాలిటీల పరిధిలో ఏర్పాటు చేసే శిబిరాల నిర్వహణ, దరఖాస్తుల స్వీకరణ, డిజిటల్ నమోదు, పత్రాల స్కానింగ్, భద్రపరచడం, సంబంధిత సంస్థలకు పంపించడం వంటి బాధ్యతలను స్పష్టంగా కేటాయించాలన్నారు. ప్రతి అధికారి తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు.ఆన్‌లైన్ హాజరు, సిబ్బంది వివరాలపై ఆదేశాలు.

అన్ని శాఖల అధికారులు తమ కార్యాలయాల్లో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను, వారి ఆన్‌లైన్ హాజరు నమోదును పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఉద్యోగి సంబంధిత మొబైల్ అప్లికేషన్ ద్వారా హాజరు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని, కార్యాలయాల లొకేషన్ వివరాలను కూడా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ప్రతి శాఖలో పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య, రోజువారీ హాజరు వివరాలను సాయంత్రం 5 గంటలలోపు నివేదించాలని స్పష్టం చేశారు.

తెలంగాణ ఫైబర్ గ్రిడ్ పనులు పూర్తి చేయాలి...

తెలంగాణ ఫైబర్ గ్రిడ్‌కు సంబంధించి ముఖ్యంగా పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పనులకు సంబంధించిన వర్క్ ఆర్డర్లు వెంటనే జారీ చేయాలని, కార్యాలయాలు ఐడీఓసీకి మారినప్పటికీ మండల కార్యాలయాల్లో పెండింగ్ పనులను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. పనుల అమలులో జాప్యం వల్ల భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అన్ని శాఖల అధికారుల సమిష్టి కృషి అవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పెంచాలని అధికారులకు సూచించారు.ఈ సమా వేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అవినీతి అధికారులపై నిర్భయంగా రాయండి: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి


• జర్నలిస్టుల సంక్షేమానికి నా జీతం నుంచి నెలకు రూ.లక్ష: ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

• జర్నలిస్టులు ఏఐ సాంకేతికతను అందిపుచ్చుకోవాలి: ప్రొఫెసర్ స్టీవెన్‌సన్



జడ్చర్ల, నవంబర్ 16 (జనంసాక్షి): ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం అడిగితే జర్నలిస్టులు నిర్భయంగా పత్రికల్లో రాయాలని, నిజాలు వెలికితీస్తే అవినీతి అధికారులపై చర్యలు తీసుకునే బాధ్యత తనదని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. నేషనల్ జర్నలిజం డే సందర్భంగా సోమవారం జడ్చర్ల స్థానిక డిగ్రీ కళాశాల సమావేశ మందిరంలో నిర్వహించిన జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కింది స్థాయి అధికారుల లంచాలు, కమిషన్ల వల్లే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విరాసత్ పనులకు రూ. 15 వేలు లంచం అడగడం, సిమెంట్ రోడ్ల బిల్లులకు 10-20 శాతం కమిషన్లు డిమాండ్ చేయడం, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రోజుకు రూ. లక్ష నుంచి రూ. 2 లక్షల వరకు వసూళ్లు జరగడం దారుణమన్నారు. అవినీతి రహిత జడ్చర్ల నిర్మాణానికి జర్నలిస్టులు సహకరించాలని కోరారు. నియోజకవర్గ జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రతి నెలా తన జీతం నుంచి రూ. లక్ష కేటాయిస్తానని, వచ్చే ఏడాదిలోపు ప్రెస్ క్లబ్ భవనాన్ని, త్వరలోనే పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముఖ్య వక్తగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ సీనియర్ ప్రొఫెసర్ స్టీవెన్‌సన్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, విలువలు కాపాడుకుంటూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పనిచేయాలని సూచించారు.





సమ్మేళనంలో రిటైర్డ్, ప్రస్తుత జర్నలిస్టులను శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ప్రొఫెసర్ స్టీవెన్‌సన్, ప్రిన్సిపల్ సుకన్య, రవిశంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ని. కృష్ణ, ప్రధాన కార్యదర్శి సుల్తాన్, ఉపాధ్యక్షుడు శేఖర్, కోశాధికారి ప్రభాకర్, కార్యదర్శి మల్లేష్, కార్యవర్గ సభ్యులు టి. శ్రీనివాస్, సంతోషి కిరణ్మయి, జనంసాక్షి జడ్చర్ల రిపోర్టర్ గోనెల నరేందర్, రాజాపూర్ రిపోర్టర్ శివప్రసాద్, జడ్చర్ల, మిడ్జిల్, నవాబుపేట మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

సాగర సామాజిక వర్గాన్ని

బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలి



నారాయణపేట, నవంబర్ 16 (జనంసాక్షి): సాగర (ఉప్పర) సామాజిక వర్గాన్ని బీసీ-డీ నుంచి బీసీ-ఏ జాబితాలోకి మార్చాలని నారాయణపేట జిల్లా సాగర సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించింది. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన సాగరులు ఎక్కువగా కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్నారని, వారి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు అవసరమని సంఘం పేర్కొంది.

సాగరులను అత్యంత వెనుకబడిన తరగతిగా గుర్తించి తగిన రిజర్వేషన్లు, బడ్జెట్ నిధులు కేటాయించాలని కోరింది. జీవో నంబర్ 59ను సవరించి ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో రిజర్వేషన్ పెంచాలని, నిర్మాణ రంగ కార్మికులుగా గుర్తించి ఆరోగ్య భద్రత కార్డులు, పెన్షన్లు అందించాలని విజ్ఞప్తి చేసింది. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై శ్రీశ్రీ సాగర భగీరథ మహర్షి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరింది. గతంలో జారీ చేసిన జీవోఎంఎస్ 166, 167లను కూడా వినతిపత్రంలో ప్రస్తావించింది.

ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి పురుషోత్తం సాగర్, కార్యదర్శి మన్నె మకుశ సాగర్, మక్తల్ మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున, విజయసాగర్, ప్రభంజన్, ఆంజనేయులు సాగర్, నరేంద్ర సాగర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల భద్రతపై ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు



నారాయణపేట, నవంబర్ 16 (జనంసాక్షి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్య విద్యార్థినుల వసతి గృహంలో జరిగిన అగ్నిప్రమాదంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం హాస్టల్‌ను సందర్శించి ప్రమాదం జరిగిన గదిని పరిశీలించి, విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 మంది విద్యార్థినులు నివసిస్తున్న హాస్టల్‌లో కనీస భద్రతా ఏర్పాట్లు లేకపోవడం బాధాకరమన్నారు. అగ్నిప్రమాదంలో పుస్తకాలు, విద్యార్హత సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులు, నగదు, వ్యక్తిగత వస్తువులు దగ్ధమయ్యాయని తెలిపారు. అగ్నిమాపక పరికరాలు, వెంటిలేషన్, తాగునీరు వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారని విమర్శించారు.

విద్యార్థినులు పలుమార్లు సమస్యలు తెలిపినా పరిష్కరించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. అద్దె భవనంలో కొనసాగుతున్న హాస్టల్‌కు తక్షణమే సౌకర్యాలు కల్పించి, విద్యార్థినుల భద్రతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాద బాధితులకు సహాయం అందించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పోషల్ వినోద్, శ్రీనివాస్ రెడ్డి, ప్రభజన్, చిన్న రఘు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.